



PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 214, పేజీలు - 08
శనివారం, జనవరి 17, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD



## పాలమూరుతో సమానంగా
# ఆదిలాబాద్ అభివృద్ధి

**- నిర్మల్‌లో రేవంత్ కీలక ప్రకటన**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** "ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటే నాకు ప్రత్యేక అభిమానం, ఇది పోరాటాల గడ్డ. పాలమూరు జిల్లాతో సమానంగా ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేయడమే నా లక్ష్యం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. నిర్మల్‌లో జరిగిన ప్రజా పాలన- ప్రగతి బాట బహిరంగ సభలో ప్రసంగించారు. జిల్లా అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు బాసర ఐఐటీ లోనే యూనివర్సిటీని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి జూపల్లి కృష్ణారావును ఆదేశించారు. ఫిబ్రవరి మొదటి వారంలో ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై సమగ్ర సమీక్ష నిర్వహించి, నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు.

**తుమ్మిడిహట్టి నిర్మాణం.. పారిశ్రామిక ప్రగతి**

ఆదిలాబాద్ రైతాంగం చిరకాల స్వప్నమైన తుమ్మిడిహట్టి ప్రాజెక్టుపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు.

2లో..



# ముంబై గడ్డపై ఠాక్రేలకు షాక్

**- మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం**



ముంబై (ప్రశ్న న్యూస్) మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి క్లీన్ స్వీప్ దిశగా దూసుకుపోతోంది. ముఖ్యంగా ఆసియాలోనే అత్యంత ధనిక మున్సిపల్ కార్పొరేషన్ అయిన బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ)పై గత 25 ఏళ్లుగా ఉన్న ఠాక్రేల పట్టును బీజేపీ-షిండే సేన కూటమి బద్దలు కొట్టింది. బీఎంసీ పరిధిలో మొత్తం 227 స్థానాలు ఉండగా మేయర్ పీఠాన్ని దక్కించుకోవడానికి 114 స్థానాలు అవసరం కాగా మహాయుతి కూటమి స్పష్టమైన ఆధిక్యాన్ని సాధించింది. బీజేపీ, షిండే శివసేన నేతృత్వంలోని మహాయుతి కూటమి 116 స్థానాలు దక్కించుకుంది. అందులో బీజేపీ 88 సీట్లు సాధించగా షిండే సేన 28 స్థానాల్లో విజయం సాధించింది. ఇక ఠాక్రే కూటమికి 82 సీట్లు రాగా అందులో ఉద్ధవ్ శివసేన 74 స్థానాల్లో, రాజ్ ఠాక్రే నేతృత్వంలోని మహారాష్ట్ర నవ నిర్మాణ సేన 8 స్థానాల్లో గెలుపొందింది. కాంగ్రెస్ పార్టీ 23 సీట్లను సాధించుకుంది.

2లో..

# రైతన్నల ఏళ్ల కల సాకారం

**- చనాక, కొరాటా పంప్ హౌస్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతాంగం దశాబ్దాల కల నెరవేరుస్తూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుక్రవారం భోరజ్ మండలం హతిఘాట్ వద్ద చనాక-కొరాటా పంప్ హౌస్‌ను ఘనంగా ప్రారంభించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించామని గతంలో ప్రకటించిన రేవంత్.. ఈ ప్రాజెక్టును ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసి జాతికి అంకితం చేశారు. పంప్ హౌస్ ప్రారంభించిన అనంతరం, ముఖ్యమంత్రి స్విచ్ ఆన్ చేసి లోయర్

2లో..

## స్టార్టప్ ఇండియా
# మిషన్‌కు పదేళ్లు

**- దేశ యువతపై ప్రధాని మోదీ ప్రశంసలు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత యువత ఆవిష్కరణలు, నూతన ఆలోచనలతో నిజమైన సమస్యలను పరిష్కరించే మార్గంలో పయనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రధాని ప్రారంభించిన 'స్టార్టప్ ఇండియా' మిషన్ పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం నాడు ఢిల్లీలోని

2లో..

## భవిష్యత్తు తీర్చిదిద్దేలా
# అతిపెద్ద రీసెర్చ్ సెంటర్

**- తిరుపతిలో 'ఏపీ ఫస్ట' పేరుతో భారీ పరిశోధన కేంద్రం**

- ఐఐటీ-ఐఐఎస్ఈఆర్ భాగస్వామ్యంతో ఏర్పాటుకు సీఎం గ్రీన్ సిగ్నల్
- భవిష్యత్ టెక్నాలజీ రంగాల్లో యువతకు నైపుణ్యం అందించడమే లక్ష్యం
- రాష్ట్రంలో డ్రోన్ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేయాలని ఆదేశం



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో యువత భవిష్యత్తును తీర్చిదిద్దడంతో పాటు, శాస్త్ర సాంకేతిక రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు ఊతమిచ్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం ఒక చారిత్రక నిర్ణయం తీసుకుంది. తిరుపతి కేంద్రంగా 'ఏపీ ఫ్యూచరిస్టిక్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ' పేరుతో రాష్ట్రంలోనే అతిపెద్ద పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తిరుపతిలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ భాగస్వామ్యంతో ఈ కేంద్రాన్ని

2లో..

## ధరణి రిజిస్ట్రేషన్లలో
# ఎడిట్ దగా

**- కోట్ల కుంభకోణం, 15 మంది అరెస్ట్**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ధరణి , భూభారతి రిజిస్ట్రేషన్లను అడ్డు పెట్టుకుని ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను వరంగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. జనగామ, యాదాద్రి జిల్లాల్లో సంచలనం సృష్టించిన ఈ రూ. 3.90 కోట్ల

2లో..

# పాలించడానికి మీరు అర్హులేనా.?

**- సీఎం చంద్రబాబుపై జగన్ ఫైర్**

అమరావతి (ప్రశ్న న్యూస్) గురజాల నియోజకవర్గానికి చెందిన వైసీపీ కార్యకర్త సాల్మన్ హత్యపై వైసీపీ అధినేత జగన్ తీవ్రంగా స్పందించారు. రాజకీయ కక్షలతో ఇలాంటి అరాచకాలు జరుగుతున్నాయంటూ చంద్రబాబును ఉద్దేశించి ఎక్స్ వేదికగా ఆయన ప్రశ్నలు సంధించారు. "చంద్రబాబు.. మీరు పాలించడానికి అర్హులేనా? రాజకీయ కక్షలతో ఎంతమంది ప్రాణాలను బలి తీసుకుంటారు? ముఖ్యమంత్రి పదవిలో ఉండి కూడా రెడ్‌బుక్ రాజ్యాంగం, రాజకీయ పాలన ముసుగులో ఇన్ని అరాచకాలకు పాల్పడతారా?" అంటూ జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త, దళిత యువకుడు మందా సాల్మన్ హత్యపై మీరు ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. అనారోగ్యంతో ఉన్న భార్యను చూడటానికి సొంత గ్రామానికి వచ్చిన సాల్మన్‌ను ఇనుప రాడ్లతో కొట్టి హత్య చేయడం అమానుషమని అన్నారు. ఈ ఘటన పూర్తిగా వైసీపీ కార్యకర్తలను భయపెట్టేందుకు

2లో..



## హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు
# కేంద్రం పచ్చజెండా

**- సీఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక లేఖ**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భాగ్యనగర వాసుల చిరకాల స్వప్నమైన హైదరాబాద్ మెట్రో రెండో దశ పనులను వేగవంతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఈ ప్రాజెక్టు పురోగతికి సంబంధించి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక అధికారిక లేఖ రాశారు. ఇటీవల తాను కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో భేటీ అయ్యానని, మెట్రో రెండో దశ నిర్మాణానికి కేంద్రం సానుకూలంగా ఉందని లేఖలో పేర్కొన్నారు. అయితే, ఈ ప్రాజెక్టు పట్టాలెక్కాలంటే రాష్ట్ర ప్రభుత్వం

2లో..



# ఈ-కామర్స్ దిగ్గజాలకు భారీ షాక్

2లో..

**- అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మెటాపై రూ. 10 లక్షల జరిమానా**




# ఇదే చివరి అవకాశం

**- స్పీకర్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం**

2లో..



## టీఎస్ ఐపాస్ విధానాన్ని నీతి ఆయోగ్
# ప్రశంసించడం గర్వకారణం

- ఈ విధానం ద్వారా రూ. 2.6 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని వెల్లడి
- పదేళ్లలో 25 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని స్పష్టీకరణ
- కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తామనే భ్రమల్లో బతకొద్దని ప్రత్యర్థులకు హితవు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తమ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ రూపకల్పన చేసిన టీఎస్ ఐపాస్ (టీఎస్ ఐపాస్) విధానం దేశంలోనే అత్యుత్తమమైనదని సాక్షాత్తు నీతి ఆయోగ్ తన తాజా నివేదికలో ప్రశంసించడం తెలంగాణకు గర్వకారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పారిశ్రామిక రంగంలో తెలంగాణ సాధించిన ప్రగతి, కేసీఆర్ దార్శనికతకు ఈ గుర్తింపే నిలువెత్తు నిదర్శనమని తెలిపారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను పదేళ్ల కాలంలోనే దేశానికే పారిశ్రామిక దిక్సూచిగా మార్చడంలో టీఎస్ ఐపాస్ పోషించిన పాత్ర అత్యంత కీలకమని కేంద్ర ప్రభుత్వ సంస్థే చెప్పడం గొప్ప విషయమని ఆయన అభిప్రాయపడ్డారు.

2లో..



## పాలమూరుతో సమానంగా

# ఆదిలాబాద్ అభివృద్ధి

బడ్జెట్ సమావేశాల లోపు ఈ ప్రాజెక్టుపై పూర్తి నివేదిక ఇవ్వాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఆదేశిస్తూ ప్రతి చుక్క నీటిని ఒడిసిపట్టి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. కేవలం సాగునీటికే పరిమితం కాకుండా, ఒకప్పుడు ఎర్రబస్సు తిరగడమే కష్టమైన ఈ ప్రాంతంలో ఎయిర్ బస్ తిరిగేలా ఎయిర్‌పోర్టును నిర్మిస్తామని, దానికి అనుబంధంగా 10 వేల ఎకరాల్లో అతిపెద్ద పారిశ్రామిక వాడను ఏర్పాటు చేసి వేలాది మందికి ఉపాధి కల్పిస్తామని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధానిని ఎన్నిసార్లయినా కలుస్తానని, ఇందుకు బీజేపీ ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

### సంక్షేమ పథకాలే ఊపిరి

పేదల సంక్షేమమే తన ప్రభుత్వ ఎజెండా అని పేర్కొన్న ముఖ్యమంత్రి, ఇప్పటికే అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల పురోగతిని వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలను ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశామని, మహిళా సంఘాలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలతో సామాన్యుడికి అండగా ఉంటున్నామని తెలిపారు. గత పాలకులు చేసిన అప్పులు రాష్ట్రానికి ఉరితాడుగా మారినా, ప్రజల సంక్షేమం కోసం వెనకడుగు వేసేది లేదని తేల్చి చెప్పారు. ఓడిపోయిన వారు చేసే విమర్శలను తాను పట్టించుకోనని, ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని మంచి చేయడానికే ఉపయోగిస్తానని అన్నారు.

### మహనీయుల స్మరణ - మున్సిపల్ ఎన్నికల నగారా

ప్రజలకు సేవ చేసిన మహనీయుల గుర్తుగా చనాక-కొరటా ప్రాజెక్టుకు సి.రామచంద్రారెడ్డి పేరును, సదర్మట్ బ్యారేజీకి నర్సారెడ్డి పేరును పెడుతున్నట్లు సీఎం ప్రకటించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల గురించి ప్రస్తావించారు. మంచి ప్రజాప్రతినిధుల్ని గెలిపించాలన్నారు. గతంలో గెలిచాం, రేపు గెలుస్తాం, మళ్లీ అధికారంలోకి వచ్చేది మేమే అని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు మేలు చేసే వారినే రాబోయే ఎన్నికల్లో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలని, ఎన్నికలు ముగిశాక కేవలం అభివృద్ధిపైనే దృష్టి పెట్టాలని ప్రజాప్రతినిధులకు సూచించారు.

# ముంబై గడ్డపై ఠాక్రేలకు షాక్

శరద్ పవార్ ఎన్సీపీ, అజిత్ పవార్ ఎన్సీపీ, ఎంఐఎం పార్టీలు కలిసి 6 సీట్లను సాధించుకున్నాయి.

### మహారాష్ట్ర వ్యాప్తంగా మహాయుతి హవా

ముంబై మాత్రమే కాకుండా మహారాష్ట్రలోని మిగిలిన 28 మున్సిపల్ కార్పొరేషన్లలో కూడా బీజేపీ కూటమి ఘనవిజయం సాధించింది. మొత్తం 29 కార్పొరేషన్లలోని 2,869 సీట్లలో బీజేపీ కూటమి సుమారు 1,517 పైగా స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. మరోవైపు.. పూణే మున్సిపల్ ఎన్నికల్లో కూడా బీజేపీ స్పష్టమైన ఆధిక్యంతో (80 సీట్లు) దూసుకుపోతోంది. అజిత్ పవార్, శరద్ పవార్ వర్గాలు కలిసి పోటీ చేసినా ఫలితం లేకపోయింది. నాగపూర్, కొల్హాపూర్, భివాండి ప్రాంతాల్లో మాత్రమే కాంగ్రెస్ పార్టీ తన ఉనికిని చాటుకుంది. మధ్యలో చిన్న విరామం మినహా 1985 నుంచి బీఎంసీపై ఉమ్మడి శివసేన పార్టీ పట్టును కొనసాగిస్తూ వస్తోంది. తాజా ఓటమితో ఠాక్రే కుటుంబానికి రాజకీయంగా పెద్ద ఎదురుదెబ్బ తగిలినట్లయింది. దాదాపు రూ. 74,400 కోట్ల వార్షిక బడ్జెట్ కలిగిన బీఎంసీ ఇప్పుడు బీజేపీ-షిండే శివసేన చేతుల్లోకి వెళ్లనుంది. జనవరి 15వ తేదీన జరిగిన పోలింగ్‌లో 52.94 శాతం ఓటింగ్ నమోదైంది.

# భవిష్యత్తు తీర్చిదిద్దేలా అతిపెద్ద రీసెర్చ్ సెంటర్

నెలకొల్పనున్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఏరో స్పేస్-డిఫెన్స్, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో డ్రోన్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ ఫస్ట్ ఏర్పాటు ప్రతిపాదనకు సీఎం ఆమోదం తెలిపారు. రాష్ట్రంలోని యువతకు, పరిశ్రమలకు మధ్య వారధిగా నిలుస్తూ, భవిష్యత్ అవసరాలకు తగ్గ నైపుణ్యాలను అందించడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, "రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. భవిష్యత్తులో ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-సైబర్ సెక్యూరిటీ, సెమీ కండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ, హెల్త్ కేర్, బయో టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ వంటివి అత్యంత కీలక రంగాలుగా మారనున్నాయి. వీటికి అనుగుణంగా మన యువతను సిద్ధం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అని అన్నారు. దేశంలోనే తొలిసారిగా కాకినాడలో గ్రీన్ అమోనియా ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కొత్త ఆవిష్కరణలకు, స్టార్టప్‌లకు ఏపీ ఒక వేదికగా నిలవాలని, అందుకు అవసరమైన నైపుణ్యమున్న మానవ వనరులను ఏపీ ఫస్ట్ అందించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ప్రముఖ కంపెనీలు, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో ఏపీ ఫస్ట్ అనుసంధానమై పనిచేయాలని సీఎం సూచించారు. "గతంలో ఐటీ, ఫార్మా రంగాలను ప్రోత్సహించడం వల్లే తెలుగువారు ఆ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా రాణిస్తున్నారు. అదే తరహాలో భవిష్యత్ రంగాలను నేటి యువత అందిపుచ్చుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వచ్చే మూడేళ్లలో ఏపీ ఫస్ట్ కీలక పురోగతి సాధించాలి" అని దిశానిర్దేశం చేశారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యా సంస్థల కరిక్యులమ్‌ను తీర్చిదిద్దడంలోనూ ఈ కేంద్రం సహాయపడాలని స్పష్టం చేశారు.

### డ్రోన్ టెక్నాలజీపై ప్రత్యేక దృష్టి

ఇదే సమావేశంలో డ్రోన్ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలోనే కాకుండా వ్యవసాయం, మెడికల్ ఎమర్జెన్సీ వంటి రంగాల్లో డ్రోన్ల వినియోగాన్ని గణనీయంగా పెంచాలన్నారు. "డ్రోన్ ట్యాక్సీ, డ్రోన్ అంబులెన్స్ వంటి అంశాలపై లోతైన అధ్యయనం చేయాలి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ తరహాలో 'డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ మేనేజ్‌మెంట్' వ్యవస్థ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను కేంద్రంతో సంప్రదించి పరిశీలించండి," అని అధికారులకు సూచించారు. టెక్నాలజీని ముందుగానే అందిపుచ్చుకోవడం ద్వారా వ్యవస్థలను సిద్ధం చేయాలన్నారు. వచ్చే అంతర్జాతీయ డ్రోన్ దినోత్సవం నాటికి డ్రోన్ల ద్వారా అందించే సేవలను ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఏరో స్పేస్ డిఫెన్స్ సలహదారు సతీష్ రెడ్డి, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహదారు అమిత్ దుగర్, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్. సత్యనారాయణ, ప్రొఫెసర్ సెంథిల్ కుమార్, డీఎంటీఐ డైరెక్టర్ కల్నల్ పి.ఎస్. రెడ్డి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రైతన్నల ఏళ్ల కల సాకారం

పెనుగంగ ప్రాజెక్టు ప్రధాన కాలువకు సాగునీటిని విడుదల చేశారు. ఈ అపురూప దృశ్యాన్ని చూసి స్థానిక రైతాంగం హర్షాతిరేకాలు వ్యక్తం చేసింది. కేవలం మాటలకే పరిమితం కాకుండా రైతుల పొలాల్లో సాగు జలాలు పారించడమే తమ ప్రభుత్వ సంకల్పమని ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులను గమనించామని, అందుకే యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయిస్తున్నామని కాంగ్రెస్ నేతుల చెబుతున్నారు. చనాక-కొరాటా ప్రాజెక్టు ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని, ఇది ఉత్తర తెలంగాణ వ్యవసాయ ముఖచిత్రాన్ని మారుస్తుందని వారంటున్నారు. లోయర్ పెనుగంగ ప్రధాన కాలువలోకి నీరు చేరడంతో ఆదిలాబాద్ జిల్లాలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని మెట్ట ప్రాంతాలకు శాశ్వత సాగునీటి పరిష్కారం లభించినట్లయిందని స్థానిక ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ప్రాధాన్యత కలిగిన మరిన్ని పెండింగ్ ప్రాజెక్టులను ఇదే స్ఫూర్తితో పూర్తి చేసి, ప్రతి ఎకరాకు నీరు అందిస్తామని ప్రజా ప్రతినిధులు చెబుతున్నారు. చనాకా-కొరాటా బ్యారేజీని ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని పెన్ గంగా నదిపై నిర్మించారు. ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం ఆదిలాబాద్ జిల్లాలోని సుమారు 50,000 ఎకరాలకు సాగునీరు అందించడం. ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన పంప్ హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసి లోయర్ పెన్ గంగా ప్రధాన కాలువకు మళ్లిస్తారు. దీనివల్ల జైనథ్, బేల, అదిలాబాద్ మండలాల్లోని మెట్ట భూములకు పుష్కలంగా సాగునీరు అందుతుంది.

వర్షాకాలంలో పెన్ గంగా నదిలో ప్రవహించే అదనపు జలాలను నిల్వ చేసుకునేందుకు ఈ బ్యారేజీ ఎంతో కీలకం.ఈ ప్రాజెక్టు అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో ప్రారంభంలో మహారాష్ట్రతో కొన్ని చిక్కులు ఎదురయ్యాయి. ముఖ్యంగా ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల మహారాష్ట్ర వైపు ఉన్న గ్రామాలు, భూములు మునిగిపోతాయనే ఆందోళనతో ఆ రాష్ట్రం అభ్యంతరం తెలిపింది. అయితే, 2016లో అప్పటి తెలంగాణ ప్రభుత్వం , మహారాష్ట్ర ప్రభుత్వం మధ్య జరిగిన చారిత్రాత్మక ఒప్పందంతో ఈ సమస్యకు పరిష్కారం లభించింది. బ్యారేజీ ఎత్తు, ముంపు విస్తీర్ణంపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. మహారాష్ట్రకు కూడా కొంత మేర నీటిని ఇచ్చేలా, ఆ రాష్ట్ర భూసేకరణకు తెలంగాణ నిధులు చెల్లించేలా ఒప్పందం కుదిరిన తర్వాతే పనులు వేగవంతమయ్యాయి. సరిహద్దు వివాదాల కారణంగా దశాబ్దాల కాలం పెండింగ్‌లో ఉన్న లోయర్ పెన్ గంగా ప్రాజెక్టులో ఈ చనాకా-కొరాటా ఒక కీలక భాగం.

# స్టార్టప్ ఇండియా మిషన్‌కు పదేళ్లు

భారత్ మండపంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ పదేళ్ల ప్రయాణం కేవలం ప్రభుత్వ కార్యక్రమ విజయం మాత్రమే కాదని, లక్షలాది యువత కలలు సాకారమైన ప్రయాణమని ఆయన అభివర్ణించారు. పదేళ్ల క్రితం దేశంలో 500 కంటే తక్కువ స్టార్టప్‌లు ఉండేవని, ఇప్పుడు ఆ సంఖ్య 2 లక్షలకు పైగా చేరిందని ప్రధాని గుర్తుచేశారు. అప్పట్లో కేవలం నాలుగు యూనికార్న్‌లు (ఒక బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువైన స్టార్టప్) ఉంటే, ఇప్పుడు 125కు పైగా క్రియాశీల యూనికార్న్‌లు ఉన్నాయని, ఈ అద్భుతమైన వృద్ధి ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని వివరించారు. ఈ ప్రగతితో భారత్, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించిందని తెలిపారు. ఈ స్టార్టప్‌లు డీప్ టెక్, స్పేస్ టెక్, డ్రోన్ టెక్, క్వాంటం టెక్, అగ్రిటెక్, ఏఐ/ఎంఎల్ వంటి 50కి పైగా రంగాల్లో పనిచేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు బలాన్నిస్తున్నాయని ప్రధాని అన్నారు. వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కథనం ప్రకారం, ఈ స్టార్టప్‌లు దేశవ్యాప్తంగా 21 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలను సృష్టించాయి.

### అందరినీ కలుపుకొని వృద్ధి

స్టార్టప్ ఇండియా మిషన్‌లో మహిళలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని మోదీ అన్నారు. గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో దాదాపు 45 శాతం వాటిలో కనీసం ఒక మహిళా డైరెక్టర్ లేదా భాగస్వామి ఉన్నారని తెలిపారు.

అంతేకాకుండా, సుమారు సగం స్టార్టప్‌లు నాన్-మెట్రో నగరాల్లోనే ఉండటం, ఆవిష్కరణల కేంద్రాలుగా టైర్-2, 3 నగరాలు ఎదుగుతున్నాయనడానికి నిదర్శనమన్నారు. ఒకప్పుడు స్టార్టప్‌లను వైఫల్యానికి దారితీసే మార్గంగా, కేవలం సంపన్నుల పిల్లలకే పరిమితమైనవిగా చూసేవారని, కానీ స్టార్టప్ ఇండియా కార్యక్రమం ఈ దృక్పథాన్ని పూర్తిగా మార్చేసిందని తెలిపారు. "నా ముందు కొత్తగా ఆవిర్భవిస్తున్న భారత్ భవిష్యత్తు కనిపిస్తోంది" అని స్టార్టప్ వ్యవస్థాపకులను ఉద్దేశించి మోదీ అన్నారు. "మీ కలలే ఈ దేశ ప్రగతికి చోదక శక్తి" అని కొనియాడారు.

### భవిష్యత్ లక్ష్యం తయారీ రంగం

డిజిటల్ స్టార్టప్‌లు, సేవా రంగంలో మనం అద్భుతమైన విజయం సాధించామని, ఇప్పుడు తయారీ రంగంపై కూడా మన స్టార్టప్‌లు మరింత దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైందని ప్రధాని పిలుపునిచ్చారు. "ప్రపంచంలోనే అత్యుత్తమ నాణ్యతతో కొత్త ఉత్పత్తులను తయారు చేయాలి. సాంకేతికతలోనూ మనం ప్రత్యేకమైన ఆలోచనలతో ముందంజ వేయాలి. మీ ప్రతి ప్రయత్నంలో ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని నేను హామీ ఇస్తున్నాను" అని మోదీ భరోసా ఇచ్చారు. ఈ వృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న మద్దతును గుర్తుచేస్తూ, 'ఫండ్ ఆఫ్ ఫండ్స్ ఫర్ స్టార్టప్స్', 'క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్ ఫర్ స్టార్టప్స్', 'స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్' వంటి పథకాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. జాతీయ స్టార్టప్‌ల దినోత్సవం మన ప్రజల ధైర్యం, ఆవిష్కరణల స్ఫూర్తి, వ్యవస్థాపక ఉత్సాహానికి ప్రతీక అని ప్రధాని తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. 'వికసిత భారత్ 2047' లక్ష్య సాధనలో స్టార్టప్‌ల పాత్ర కీలకమని స్పష్టం చేశారు.

# ధరణి రిజిస్ట్రేషన్లలో ఎడిట్ దగా

కుంభకోణంలో ప్రమేయం ఉన్న 15 మంది నిందితులను జనగామ పోలీసులు అదుపులోకి తీసుకోగా, మరో తొమ్మిది మంది పరారీలో ఉన్నారు. ఈ ముఠా నుండి రూ. 63.19 లక్షల నగదుతో పాటు సుమారు కోటి రూపాయల విలువైన ఆస్తి పత్రాలు, కారు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, 17 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ వివరాలను వెల్లడించారు.

### టెక్నాలజీతో చలాన్ మాయాజాలం

కుంభకోణంలో ప్రధాన నిందితులైన పసునూరి బసవరాజు, జెల్లా పాండు యాదగిరిగుట్టలో ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్లు నిర్వహిస్తూ ఈ మోసానికి తెరలేపారు. వీరు వెబ్‌సైట్‌లోని ఇన్‌స్పెక్ట్ ఎలిమెంట్, ఎడిట్ అప్లికేషన్ ఆప్షన్లను ఉపయోగించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన చలాన్ రుసుమును సాఫ్ట్‌వేర్ ద్వారా తగ్గించేవారు. రైతుల వద్ద నుంచి పూర్తి మొత్తాన్ని వసూలు చేసి, ప్రభుత్వానికి మాత్రం తక్కువ మొత్తాన్ని చెల్లిస్తూ నకిలీ రసీదులను సృష్టించేవారు. ఈ నకిలీ చలాన్లను స్థానిక ఎమ్మార్వో , రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సమర్పించి రిజిస్ట్రేషన్లు పూర్తి చేయించేవారు. సులభంగా డబ్బు సంపాదించే క్రమంలో వీరు మీ-సేవ కేంద్రాలు, మధ్యవర్తులతో కలిసి ఈ దందా సాగించారు.

### 1,080 డాక్యుమెంట్లు.. 22 కేసులు

నిందితులు ఇప్పటివరకు జనగామ, యాదాద్రి జిల్లాల్లో సుమారు 1,080 డాక్యుమెంట్లకు సంబంధించి ఇలాంటి అక్రమ లావాదేవీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో మధ్యవర్తులకు, ఆన్‌లైన్ సెంటర్ల నిర్వాహకులకు 10 నుండి 30 శాతం వరకు కమిషన్లు ఇచ్చి ముఠాగా ఏర్పడ్డారు. ఈ భారీ కుంభకోణంపై ఇప్పటివరకు యాదాద్రి జిల్లాలో 15 కేసులు, జనగామ జిల్లాలో 7 కేసులు కలిపి మొత్తం 22 కేసులు నమోదయ్యాయి. అరెస్ట్ అయిన వారిలో పసునూరి బసవరాజు, జెల్లా పాండుతో పాటు గణేష్ కుమార్, శ్రీనాథ్, వెంకటేష్, శ్రావణ్ వంటి పలువురు నిందితులు ఉన్నారు.

### పోలీసుల చాకచక్యం - కమిషనర్ అభినందనలు

సాంకేతిక పరిజ్ఞానాన్ని అడ్డుపెట్టుకుని సాగుతున్న ఈ వ్యవస్థీకృత నేరాన్ని ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన జనగామ డీసీపీ, ఏఎస్పీ, ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బందిని పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. పరారీలో ఉన్న మిగిలిన తొమ్మిది మంది నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే ఇలాంటి చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు హెచ్చరించారు. రైతులు కూడా ఇటువంటి మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని, అధికారిక రసీదులను సరిచూసుకోవాలని సూచించారు.

# ఈ-కామర్స్ దిగ్గజాలకు భారీ షాక్

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆన్‌లైన్ వ్యాపార రంగంలో తిరుగులేని శక్తులుగా వెలుగొందుతున్న అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థలకు కేంద్ర ప్రభుత్వం గట్టి హెచ్చరిక జారీ చేసింది. దేశ భద్రతా నియమాలను తుంగలో తొక్కి.. అనుమతి లేని వాకీ-టాకీలను విక్రయించినందుకు గాను 8 ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలపై కేంద్ర వినియోగదారుల రక్షణ సంస్థ (సీసీపీఏ) మొత్తం రూ. 44 లక్షల జరిమానా విధించింది. దేశ భద్రతకు ముప్పు కలిగించే వైర్‌లెస్ పరికరాల విక్రయంపై ప్రభుత్వం తీసుకున్న ఈ సుమోటో చర్య ఇప్పుడు పారిశ్రామిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

### ఎవరెవరికి ఎంత జరిమానా.?

వినియోగదారుల హక్కులను కాలరాస్తూ, తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేసినందుకు గాను కింది సంస్థలపై భారీ పెనాల్టీలు విధించింది. ముఖ్యంగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మెటా (ఫేస్‌బుక్ మార్కెట్‌ప్లేస్), మీషో సంస్థలకు ఒక్కొక్కటి రూ. 10 లక్షల చొప్పున జరిమానా వేశారు. అలాగే జియోమార్ట్, టాక్ ప్రో, చిమియా, మాస్క్‌మ్యాన్ టాయ్స్ సంస్థలకు ఒక్కొక్కటి రూ. 1 లక్ష చొప్పున జరిమానా పడింది. వీరిలో మీషో, మెటా, జియోమార్ట్ వంటి సంస్థలు ఇప్పటికే జరిమానా చెల్లించగా మిగిలిన వారి నుంచి చెల్లింపులు అందాల్సి ఉందని వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖేరే వెల్లడించారు.

### అసలు ఉల్లంఘన ఏమిటి.?

భారత టెలికాం చట్టాల ప్రకారం కేవలం 446.0-446.2 ఫ్రీక్వెన్సీ బ్యాండ్‌లో పనిచేసే వాకీ-టాకీలకు మాత్రమే లైసెన్స్ మినహాయింపు ఉంటుంది. అయితే ఈ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లలో సుమారు 16,970 కి పైగా ఉత్పత్తులు ఈ పరిమితిని దాటి పని చేస్తున్నట్లు సీసీపీఏ గుర్తించింది. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ఈ పరికరాలకు తప్పనిసరిగా ఉండాల్సిన ఎక్విప్‌మెంట్ టైప్ అప్రూవల్ (ఈటీఏ) సర్టిఫికేషన్ లేదు. అలాగే ఫ్లిప్‌కార్ట్‌లో సుమారు 65,000 యూనిట్లు ఫ్రీక్వెన్సీ వివరాలు లేకుండానే అమ్ముడు అయ్యాయి. ఈ అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం "ప్రివెన్షన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఇల్లీగల్ లిస్టింగ్ ఆఫ్ రేడియో ఎక్విప్‌మెంట్ గైడ్‌లైన్స్ 2025"ను నోటిఫై చేసింది. ఇకపై ప్రతి ఈ-కామర్స్ ప్లాట్‌ఫారమ్ తమ వెబ్‌సైట్‌లోని రేడియో పరికరాలపై సెల్ఫ్-ఆడిట్ నిర్వహించి, ఆ ధృవీకరణ పత్రాన్ని ఆన్‌లైన్‌లో ఉంచాల్సి ఉంటుంది. తాము కేవలం మధ్యవర్తులం మాత్రమేనని, థర్డ్ పార్టీ విక్రేతలకు బాధ్యత లేదని కంపెనీలు వాదించినప్పటికీ.. సీసీపీఏ ఆ వాదనను తోసిపుచ్చింది.ం

## ఇంగ్లాండ్‌లో పట్టా పొందిన

# విద్యార్థికి సన్మానం



**కమాన్ పూర్** పాలకుర్తి మండలంజీడి నగర్ నగర్ కు చెందిన చింతకింది కిరణ్ కుమార్ ను ఘనంగా సన్మానించారు. జీడి నగర్ గ్రామ పంచాయతీ బీసీ కాలనీ చెందిన చింతకింది కిరణ్ కుమార్ పంజాబ్ లవ్లి ప్రొఫెషనల్ యూనివర్సిటీలో మాజీ ప్రధాని మేరీ ఎలిజిబెత్ ట్రస్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా పొందిన సందర్భంగా జీడి నగర్ గ్రామపంచాయతీ నాల్గవ వార్డు సభ్యులు కాంకటి శ్రీనివాస్ .కన్నాల మాజీ ఉప సర్పంచ్ పుట్ట రంజిత్ బండారి రాజు,దాసరి సాగర్ దేగల సంతోష్,బైరి రాజేశం వారికి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కంకటి శ్రీనివాస్ మాట్లాడుతూ, క్రమశిక్షణ మరియు పట్టుదలతో శ్రమించి ఉన్నత శిఖరాలను అధిరోహించిన చింతకింది కిరణ్ కుమార్ నేటి యువతకు ఆదర్శమని కొనియాడారు. వారికృషి సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.చింతకింది కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. తన ఎదుగుదలకు సహకరించిన తల్లిదండ్రులకు, గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ గౌరవం తన బాధ్యతను మరింత పెంచిదని ఆనందం వ్యక్తం చేశారు.

# ఇదే చివరి అవకాశం

న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై శుక్రవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ క్రమంలో తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి అత్యున్నత న్యాయస్థానం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారాన్ని తేల్చేందుకు తగిన సమయం ఇచ్చినా ఇంకా నిర్ణయం తీసుకోకపోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారా లేదంటే తామే నిర్ణయం తీసుకోవాలా అని కోర్టు ప్రశ్నించింది. ఈ విషయంలో స్పీకర్‌కు మరో అవకాశం ఇచ్చిన సుప్రీంకోర్టు రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకోకపోతే తామే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. రెండు వారాల్లో ఎమ్మెల్యేల అనర్హత వేటుపై స్పీకర్ తీసుకున్న చర్యల అఫిడవిట్ ఇవ్వాలని ఆదేశించింది.జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ ధర్మాసనం శుక్రవారం ఈ కేసుపై విచారణ చేపట్టింది. ఈ క్రమంలో స్పీకర్ తరఫు న్యాయవాది ఇప్పటివరకు స్పీకర్ ఏడుగురు ఎమ్మెల్యేలకు సంబంధించిన పిటిషన్లపై తీసుకున్న చర్యలను కోర్టుకు విన్నవించారు. మిగతా వారిపై నిర్ణయం తీసుకోకపోవడంతో ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో మిగతా వారిపై 2 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఈ క్రమంలో స్పీకర్ తరఫు న్యాయవాది, మిగతా ముగ్గురు ఎమ్మెల్యేల విచారణ పూర్తి చేసేందుకు 4 వారాల సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఇప్పటికే స్పీకర్‌కు చాలా సమయం ఇచ్చామని, ఇదే చివరి అవకాశం అని స్పష్టం చేసింది. ఇంకా ఆలస్యం చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించింది. స్పీకర్ రెండు వారాల్లోగా ఒక అఫిడవిట్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశించింది.అందులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి తీసుకున్న చర్యలు, పురోగతిని వివరించాలని సూచించింది. రెండు వారాల తర్వాత తదుపరి విచారణ జరగనుంది. మిగిలిన కేసుల్లో స్పష్టమైన పురోగతి కనిపిస్తే, అదనపు సమయం గురించి తర్వాత ఆలోచిస్తామని సుప్రీంకోర్టు బదులిచ్చింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల్లో దానం నాగేందర్, కడియం శ్రీహరి, సంజయ్‌లపై అనర్హత పిటిషన్లపై ఇంకా నిర్ణయం వెలువడలేదు. ఇతర కేసుల్లో, పార్టీ మారినట్లు సరైన ఆధారాలు లేకపోవడంతో స్పీకర్ వారి పిటిషన్లను కొట్టివేశారు. స్పీకర్ తీసుకున్న నిర్ణయాలలోని లోపాలను ఈ దశలో తాము పరిశీలించలేమని కోర్టు స్పష్టం చేసింది. ఏవైనా అభ్యంతరాలు ఉంటే, ప్రత్యేక న్యాయ ప్రక్రియల ద్వారా లేవనెత్తాలని సూచించింది.

# టీఎస్ ఐపాస్ విధానాన్ని నీతి ఆయోగ్ ప్రశంసించడం గర్వకారణం

పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అడ్డంకులను తొలగించి, సింగిల్ విండో విధానంలో కేవలం 15 నుంచి 30 రోజుల్లోనే అన్ని అనుమతులు ఇచ్చేలా టీఎస్ ఐపాస్‌ను రూపొందించామని కేటీఆర్ గుర్తుచేశారు. అవినీతికి ఏమాత్రం తావులేని అత్యంత పారదర్శకమైన ఈ విధానాన్ని పదేళ్లపాటు చిత్తశుద్ధితో అమలు చేయడం వల్లే అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని వివరించారు.ఈ విధానం ద్వారా భారీ పరిశ్రమలతో పాటు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల విభాగంలో రూ. 2.6 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని తెలిపారు. తద్వారా రాష్ట్రంలో 25 లక్షల మందికి పైగా యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా గౌరవప్రదమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం దేశ చరిత్రలోనే ఒక సువర్ణ అధ్యాయమని వ్యాఖ్యానించారు. గతంలో తమ ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, టీ-హబ్ వంటి వినూత్న కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించినట్లే, ఇప్పుడు టీఎస్ ఐపాస్‌కు కూడా లభించిందని కేటీఆర్ తెలిపారు. ప్రపంచ దిగ్గజ సంస్థల నుంచి చిన్న పరిశ్రమల వరకు తెలంగాణ వైపు చూసేలా పెట్టుబడిదారుల్లో ఈ విధానం కొండంత విశ్వాసాన్ని నింపిందన్నారు. "ఇకనైనా కేసీఆర్ గారి ఆనవాళ్లు చెరిపేస్తామనే భ్రమల్లో బతికే అరాచక శక్తులు బుద్ధి తెచ్చుకుంటే మంచిది" అని పరోక్షంగా ప్రస్తుత ప్రభుత్వంపై ఆయన విమర్శలు గుప్పించారు. తెలంగాణ మోడల్ ఆచరణీయమని నీతి ఆయోగ్ చెప్పిన తర్వాత కూడా విమర్శలు చేయడం తగదని హితవు పలికారు.

# పాలించడానికి మీరు అర్హులేనా.?

అధికార పార్టీ నేతలు, కొంతమంది పోలీసులు కలిసి చేస్తున్న కుట్రేనని జగన్ ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా, తమకు నచ్చని వారిని బెదిరించడం, హత్యా రాజకీయాలకు పాల్పడటం వల్లే పిన్నెల్లి గ్రామం నుంచి వందలాది వైసీపీ కార్యకర్తల కుటుంబాలు ప్రాణభయంతో ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయాయని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నాటి నుంచి పల్నాడు జిల్లా సహా రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా సిగ్గు లేకుండా ఈ ప్రభుత్వం హింసను ప్రోత్సహిస్తోందని జగన్ విమర్శించారు. పౌరులకు రక్షణ కల్పించడం, వారు స్వేచ్ఛగా జీవించేలా చూడటం ప్రభుత్వ బాధ్యత కాదా? అని ప్రశ్నించారు. ఆ బాధ్యతను నిర్వర్తించడంలో విఫలమవడం మాత్రమే కాకుండా, కక్షల కోసం శాంతిభద్రతలను దెబ్బతీస్తూ హత్యా రాజకీయాలకు వెన్నుదన్నుగా నిలవడం ఘోరమైన నేరమని అన్నారు. ఇది స్పష్టమైన రాజ్యాంగ ఉల్లంఘన అని పేర్కొంటూ, హింసా రాజకీయాలకు పాల్పడుతున్న వారిని ప్రజలు ఎప్పటికీ క్షమించరని, తప్పకుండా మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు.

# హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కుకేంద్రం పచ్చజెండా

కొన్ని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

### అధికారుల కమిటీ ఏర్పాటు - రాష్టానికి కేంద్రం పిలుపు

మెట్రో రెండో దశ పనుల పర్యవేక్షణ, సమన్వయం కోసం కేంద్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం తరపున ఇద్దరు, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇద్దరు అధికారులతో కూడిన నలుగురు సభ్యుల బృందం ఉంటుంది. ఈ కమిటీ ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతిపాదించే ఇద్దరు అధికారుల పేర్లను వెంటనే పంపాలని కిషన్ రెడ్డి ముఖ్యమంత్రిని కోరారు. ఈ కమిటీ ప్రాజెక్టు రూపకల్పన, నిధుల కేటాయింపు మరియు అమలు తీరుపై తుది నిర్ణయాలు తీసుకోనుంది.

### మెట్రో నెట్‌వర్క్ స్వాధీనం - కీలక నిబంధన

మెట్రో మొదటి దశకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు ,ఒప్పందాలు పూర్తయిన తర్వాతే రెండో దశ నిర్మాణ ప్రక్రియ వేగం పుంజుకుంటుందని కేంద్రం స్పష్టం చేసింది. ప్రస్తుతం ఎల్ అండ్ టీ సంస్థ ఆధ్వర్యంలో ఉన్న మెట్రో నెట్‌వర్క్‌ను రాష్ట్ర ప్రభుత్వం తన అధీనంలోకి తీసుకోవాలని నిర్ణయించింది.

ఆ ప్రక్రియ ముగిసిన తర్వాతే రెండో దశకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను కేంద్రానికి పంపాలని కిషన్ రెడ్డి సూచించారు. ఈ అడ్డంకులు తొలగితేనే కేంద్రం నుండి నిధుల విడుదల, సాంకేతిక సహకారం సులభతరమవుతుందని ఆయన వివరించారు.

### వేగంగా నిర్ణయం తీసుకోవాలి!

పెరుగుతున్న నగర జనాభా , ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా మెట్రో రెండో దశను వీలైనంత త్వరగా పూర్తి చేయడం అత్యవసరమని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా విమానాశ్రయం , నగరంలోని ఇతర శివార్లకు మెట్రో కనెక్టివిటీ కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. కేంద్రం పూర్తి సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్న తరుణంలో, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సాంకేతిక ప్రక్రియలను పూర్తి చేయాలని ఆయన తన లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.

# ఎండిపోతున్న వేప చెట్లపై వేదన

## ఆయుర్వేద పరంపరమూలిక వైద్య మహాసంఘం దృష్టి

**ఆయుర్వేద పరంపరమూలిక వైద్య మహాసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సింహాచలం లక్ష్మణస్వామి**

ఎండిపోతున్న వేప చెట్లు: ఒక విశ్లేషణ






భారతీయ సనాతన ధర్మంలో ప్రకృతి మరియు మానవ ఆరోగ్యం అవిభాజ్యమైన బంధం కలిగి ఉన్నాయి. ఆయుర్వేదం, మన పురాతన జ్ఞాన సంపద, ప్రకృతి నుంచి వచ్చిన మూలికలను, చెట్లను మన జీవనశైలిలో భాగం చేసి, సర్వరోగ నివారణకు మార్గం చూపింది. అలాంటి మహత్తరమైన మూలికలలో వేప చెట్టు ఒక అమూల్యమైన రత్నం. "సర్వ రోగ నివారిణి"గా పిలువబడే ఈ చెట్టు, మన సంస్కృతిలో, ఆరోగ్యంలో, పర్యావరణంలో కీలక పాత్ర పోషిస్తుంది. కానీ, నేడు మన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి ప్రాంతాల్లో వేప చెట్లు ఎండిపోతున్నాయి. ఈ దృశ్యం చూస్తుంటే హృదయం ద్రవిస్తుంది. ఆయుర్వేద పరంపరమూలిక వైద్య మహా మహాసంఘం తరపున ఈ వేదనను వ్యక్తపరుస్తూ, ఈ వ్యాసాన్ని రచిస్తున్నాను.

వేప చెట్టు: ఆయుర్వేదంలో ఒక అద్భుతం

ఆయుర్వేద గ్రంథాలలో వేపను "నింబ" అని పిలుస్తారు. చరక సంహిత, సుశ్రుత సంహిత వంటి పురాతన గ్రంథాలు వేప ఆకులు, పువ్వులు, బెరడు, విత్తనాలు, నూనెలను వివిధ రోగాల చికిత్సకు సూచిస్తాయి. వేపలో అజాడిరాచ్టిన్ వంటి సమ్మేళనాలు ఉండటం వల్ల ఇది యాంటీబాక్టీరియల్, యాంటీఫంగల్, యాంటీవైరల్ గుణాలు కలిగి ఉంటుంది.

చర్మ రోగాలు: వేప ఆకులతో తయారైన లేపనాలు మొటిమలు, ఎగ్జిమా, సోరియాసిస్ వంటి సమస్యలను తగ్గిస్తాయి.

రక్త శుద్ధి: వేప ఆకుల రసం రక్తాన్ని శుద్ధి చేసి, మధుమేహం, మలేరియా వంటి రోగాలను నియంత్రిస్తుంది.

పంటల రక్షణ: వేప నూనె సహజమైన పురుగుమందుగా పనిచేసి, సేంద్రీయ వ్యవసాయానికి దోహదపడుతుంది.

పర్యావరణ ప్రయోజనాలు: వేప చెట్టు నీడలో విశ్రాంతి తీసుకుంటే మానసిక శాంతి లభిస్తుంది. ఇది వాయు మాలిన్యాన్ని తగ్గించి, భూమి సారవంతాన్ని పెంచుతుంది.

మన పూర్వీకులు వేపను దైవ స్వరూపంగా పూజించారు. ఉగాది పచ్చడిలో వేప పువ్వు చేర్చడం ద్వారా జీవితంలో చేదును స్వీకరించాలని సందేశం ఇస్తారు. అలాంటి ఈ చెట్టు నేడు మన కళ్ల ముందు ఎండిపోతుంటే, మన పరంపరను కోల్పోతున్నామని భావన కలుగుతుంది.ఎండిపోతున్న వేప చెట్లు: కారణాలు మరియు వేదనతెలంగాణలో, ముఖ్యంగా హైదరాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ వంటి ప్రాంతాల్లో వేప చెట్లు ఉన్నట్టుండి ఎండిపోతున్నాయి. ఇది ఒక్క రాష్ట్ర సమస్య కాదు; దక్షిణ భారతంలో వ్యాపిస్తున్న బెడద.

**కారణాలు:**

డైబ్యాక్ తెగులు ఫంగస్ సోకడం వల్ల కొమ్మలు ఎండిపోతాయి. ఇది వేప చెట్టు ఆకులు, కాండం ద్వారా వ్యాపిస్తుంది. లక్షలాది చెట్లు ఈ తెగులుకు బలవుతున్నాయి.

టీ మాస్కిటో బగ్ రాత్రి సమయంలో ఈ కీటకం ఆకుల రసాన్ని పీల్చి, చెట్టును బలహీనపరుస్తుంది. ఇది వైరస్ లాంటి ప్రభావం చూపుతుంది.పర్యావరణ మార్పులు: కాలుష్యం, వాతావరణ మార్పు, అధిక ఉష్ణోగ్రతలు, నీటి కొరత వల్ల చెట్లు ఒత్తిడికి గురవుతున్నాయి. సేంద్రీయ వ్యవసాయం తగ్గడం, రసాయనిక పురుగుమందుల వాడకం ఈ సమస్యను తీవ్రతరం చేస్తున్నాయి.మానవ నిర్లక్ష్యం: నగరీకరణలో రోడ్ల విస్తరణ, భవన నిర్మాణాల కోసం చెట్లు నరికివేయడం, సరైన నిర్వహణ లేకపోవడం.ఈ దృశ్యాలు చూస్తుంటే వేదన కలుగుతుంది. వేప చెట్టు ఎండిపోవడం అంటే కేవలం ఒక చెట్టు కోల్పోవడం కాదు; మన ఆయుర్వేద సంపద, పర్యావరణ సమతుల్యత, సాంస్కృతిక వారసత్వం కోల్పోవడం. లక్షలాది చెట్లు చనిపోతుంటే, ప్రభుత్వాలు, సమాజం ఎందుకు నిద్రపోతున్నాయి?

### ఆయుర్వేద దృక్పథంలో పరిష్కారాలు

ఆయుర్వేదం సమస్యలకు సహజమైన పరిష్కారాలు చూపుతుంది. వేప చెట్లను రక్షించడానికి మహాసభ సూచనలు:

సహజ చికిత్స: డైబ్యాక్ తెగులుకు వేప నూనె మిశ్రమాన్ని (లీటరు నీటికి 5 మి.లీ వేప నూనె) పిచికారీ చేయండి. తులసి, గోమూత్రం కలిపిన కషాయాలు కీటకాలను తరిమికొట్టుతాయి.

**సేంద్రీయ వ్యవసాయం ప్రోత్సాహం:** రసాయనిక మందులకు బదులు వేప పిండి, నూనె వాడకం పెంచండి. ఇది పంటలను రక్షిస్తూ, వేప డిమాండ్ పెంచుతుంది.

**వృక్షారోపణ కార్యక్రమాలు:** ప్రతి గ్రామంలో వేప చెట్లు నాటండి. మహాసంఘం తరపున ఉచిత సలహాలు, శిక్షణలు అందిస్తాం.

**ప్రభుత్వ సహకారం:** ప్రభుత్వాలు వేప చెట్ల రక్షణకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. ఆయుర్వేద గ్రామాలు స్థాపించి, మూలికల పరిరక్షణ చేపట్టాలి.

**సమాజ చైతన్యం:** ప్రతి ఒక్కరూ వేప చెట్టును కాపాడాలి. ఉగాది, దసరా వంటి పండుగల్లో వేప ప్రాముఖ్యతను ప్ర చా ర ం చేయండి.

వేప చెట్టు మనకు ఇచ్చిన జ్ఞాన సంపదకు మనం రుణపడి ఉన్నాం. దానిని కోల్పోతే, మన ఆరోగ్యం, వ ర్యా వ ర ణ ం దెబ్బతింటాయి. ఆయుర్వేద పరంపరమూలిక వైద్య మహాసంఘం తరపున అందరినీ కోరుతున్నాను: వేపను రక్షించుకుందాం, మన పరంపరను కాపాడుకుందాం. జై ఆయుర్వేదం! జై భారత్!

## రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటిస్తే

# ప్రయాణం సురక్షితం

## – పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి



**పెద్దపల్లి** రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ ప్రయాణం సురక్షితం గా సాగించాలని పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి అన్నారు. ఇం దులో భాగంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అరైవ్ ?.. అలై వ్ కార్యక్రమం నిర్వహిస్తుంద న్నారు. ఇందులో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వుల మేరకు పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్దపల్లి పురపాలక సంఘంలోని ఉద్యోగులకు రోడ్డు భద్రత నియమాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, రోజు రోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనే నని ఆయన తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ఉప యోగించాలని సూచించా రు. అలాగే సెల్ ఫోన్ మాట్లాడు తూ డ్రైవింగ్ పరిపాటిగా మారిందన్నారు. చిన్న చిన్న నియమాలు ప్రమాద సమయంలో ప్రాణాలను కాపాడే కీలక భద్రతా చర్యలని డీసీపీ వివరించారు. అధిక వేగం, మద్యం సేవించి వాహ నాలు నడపడం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయ డం వంటి ప్రమాదకర అలవా ట్లను పూర్తిగా నివారించాలని కోరారు. ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు సిగ్నల్స్ పాటిస్తూ వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాల ను తగ్గించవచ్చని తెలిపారు. ప్రతి వ్యక్తి సురక్షితంగా తన గమ్యస్థానానికి చేరుకోవడమే నని, ఇందుకోసం ప్రభుత్వ ఉద్యోగులు ముందుగా రోడ్డు భద్రత నియమాలను పాటించి ప్రజలకు ఆదర్శంగా నిలవాల ని డీసీపీ పిలుపునిచ్చారు. ఈ అవగాహన కార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ పెద్దపల్లి సీఐ కె. ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ సీఐ బి. అనిల్ కుమార్, పెద్దపల్లి టౌన్ ఎస్ ఐ జె. లక్ష్మణ్ రావు లు పురపాలక సంఘం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వీడలేక... సెలవిక...

**– చిన్ననాటి మిత్రుడి మరణం తట్టుకోలేక... – కన్నీటి పర్యంతమైన ఆప్త మిత్రులు...**
**– స్నేహబంధంను చాటిన దేవి లక్ష్మీనరసయ్య.. – బరువెక్కిన గుండెలతో పాడె మోసి... వీడ్కోలు పలికి...**

**కమాన్ పూర్** చిన్ననాటి మిత్రుడి మరణం... వారందరిని కలిచి వేసింది... అర్ధంతరంగా తమ నుంచి శాశ్వతంగా దూరం కావడం ఆ స్నేహితుల హృదయాలను బరువెక్కించింది.. ఐదు దశాబ్దాల ఆ స్నేహబంధం లో ఒకరు హఠాత్తుగా వెళ్లిపోవడం తీరని దుఃఖం మిగిల్చింది.. కన్నీటి పర్యంతమైన ఆ ఆప్తమిత్రులు అన్ని తామై కడవరకు సాగనంపిన సంఘటన పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్ నగర్ లో పలువురే హృదయాలను కలిసివేసింది. స్నేహమంటే వీరిదే అన్న మాట అంతటా వినిపించింది. బరువెక్కిన గుండెలతో చిన్ననాటి మిత్రుడు భౌతికకాయం ను భుజాన మోసి న మిత్రుడు దేవి లక్ష్మీ నరసయ్య పలువురికి ఆదర్శంగా నిలిచాడు. బసంత్ నగర్ కు చెందిన దేవరకొండ ప్రకాష్ అనే వ్యక్తి బుధవారం హఠాత్తుగా మరణించాడు. ఇది విన్న చిన్ననాటి మిత్రులు ఒక్కసారిగాగ్ర్భ్రాంతికి లోనయ్యారు. అతని జ్ఞాపకాలు గుర్తుచేసుకొని కన్నీటి పర్యంతమయ్యారు. తమ చిన్ననాటి స్నేహితుడు మరణం వృధా కాకూడదనిభావించారు. మరణంలోనూ మహోపకారం చాటాలని కుటుంబ సభ్యులను ఒప్పించి మిత్రుడి నేత్రాలను దానం చేసి మరో ఇద్దరు అందులకు వెలుగును ప్రసాదించారు. అయితే ప్రకాష్ భౌతికకాయంను బసంత్ నగర్ కు తీసుకురాగా మృతదేహంను ఇంటిలోకి రానీయకుండా తన తమ్ముడి ఇంటి యజమాని ఆక్షేపించారు. దీంతో స్నేహితులే మరొక ఆశ్రయం చూపించి అప్పటికప్పుడు తాత్కాలికంగా ఆర్థిక సహాయం అందించి దగ్గరుండి దహన సంస్కారాలు పూర్తి చేశారు.



## ఎస్వీ గోశాలలో గోపూజ మహోత్సవం



**తిరుపతి** తిరుపతిలోని ఎస్వీ గోశాలలో శుక్రవారం రోజు కనుమ పర్వదినాన్ని పురస్కరించుకుని గోపూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. వేదమంత్రోచ్చారణల నడుమ గోమాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు పాల్గొని కనుమ పండుగను ఆధ్యాత్మికంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో అనిల్ కుమార్ సింఘాల్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రంప్‌కు నోబెల్ బహుమతిని బహూకరించిన మచాడో

**న్యూఢిల్లీ,** 2024 ఎన్నికల్లో తాను గెలిచానని, అయితే నిలకస్ మదురో ఆ ఫలితాలను వెల్లడించలేదని మారియా కొరినా మాచాడో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు తెలిపారు. తన నోబెల్ శాంతి బహుమతిని ట్రంప్‌నకు ఇచ్చారుఅమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం నాడు వెనిజులా ప్రతిపక్ష నాయకురాలు, నోబెల్ శాంతి బహుమతి విజేత మరియా కొరినా మచాడోను కలిశారు. వైట్‌హౌస్‌లో ఈ భేటీ సందర్భంగా మచాడో అమెరికా అధినేత ట్రంప్‌నకు తన నోబెల్ శాంతి బహుమతిని బహూకరించారు. వైట్ హౌస్ ఈ విషయాన్ని స్పష్టం చేసింది. అయితే ఇది ట్రంప్ వైఖరిలో పెద్ద మార్పుగా పరిగణించకూడదని కూడా స్పష్టం చేసింది.వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ వెనిజులా ప్రజల కోసం 'ధైర్యవంతురాలు, బలమైన స్వరంగా' ప్రతిపక్ష నాయకురాలు మచాడోను అభివర్ణించారు. అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ ఈ సమావేశం పట్ల సానుకూలంగా ఉన్నారని ఆమె అన్నారు. అయితే, ట్రంప్ ఇప్పుడు మచాడోను వెనిజులా నాయకురాలిగా భావిస్తున్నారా అని అడిగినప్పుడు, ట్రంప్ నిర్ణయం ఇప్పటికీ ఒకటేనని చెప్పారు.

ప్రస్తుత పరిస్థితుల్లో మచాడోకు దేశంలో తగినంత మద్దతు లేదని ట్రంప్ భావిస్తున్నారని ఆమె తెలిపారు. భవిష్యత్తులో వెనిజులాలో నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగాలని డొనాల్ట్ ట్రంప్ కోరుకుంటున్నారని లెవిట్ చెప్పారు. అయితే, ఈ ఎన్నికలు ఎప్పుడు జరగవచ్చో ఆమె చెప్పలేదు. ట్రంప్‌తో సమావేశం తర్వాత మచాడో మీడియాకు మాట్లాడుతూ.. ట్రంప్‌నకు తన నోబెల్ శాంతి బహుమతిని అందజేసినట్లు చెప్పారు. దీనిని 'మా స్వాతంత్ర్యానికి ఆయన ప్రత్యేక మద్దతుకు గుర్తింపు' అని మచాడో పేర్కొన్నారు.వైట్ హౌస్ నుంచి బయటకు వచ్చిన తరువాత మచాడో బయట నిల్చుని ఉన్న తన మద్దతుదారులను కలిశారు. 'మేము అధ్యక్షుడు ట్రంప్‌ను నమ్మవచ్చు.' దీనిపై ఆమె మద్దతుదారులు 'థాంక్యూ ట్రంప్' అని నినాదాలు చేశారు.ఈ సమావేశం రెండు వారాల కిందట అమెరికా సైన్యం వెనిజులా మాజీ అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోర్స్‌ను రాజధాని కారకాస్ నివాసం నుండి అరెస్ట్ చేసి న్యూయార్క్‌కు తరలించిన తరువాత జరిగింది.

మదురో, ఆయన భార్యపై డ్రగ్స్ అక్రమ రవాణా ఆరోపణలు ఉన్నాయి. మచాడో కూటమి 2024 అధ్యక్ష ఎన్నికల్లో గెలిచినట్లు పేర్కొంది. కానీ అధ్యక్షుడు మదురో ఫలితాలను అంగీకరించడానికి నిరాకరించారు.ట్రంప్ మచాడోను కలిసినప్పటికీ, గతంలో ఆమె నాయకత్వ సామర్థ్యంపై ప్రశ్నలు లేవనెత్తారని తెలిసిందే. ప్రస్తుత తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌తో కలిసి పనిచేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని ట్రంప్ పేర్కొన్నారు. రోడ్రిగ్జ్ మాజీ ఉపాధ్యక్షురాలు, ప్రస్తుతం ప్రభుత్వ పాలన చూసుకుంటున్నారు.అమెరికా ప్రస్తుతం వెనిజులా చమురు రంగంపై ఒత్తిడి పెంచుతోంది. ఇటీవల నిషేధిత చమురు ట్యాంకర్ సైతం స్వాధీనం చేసుకున్నారు. రోడ్రిగ్జ్ తాత్కాలిక ప్రభుత్వం అమెరికాతో సహకరిస్తుంని అమెరికా అధికారులు అంటున్నారు. దీని కింద ఈ వారం ఐదుగురు అమెరికన్ పౌరులను వెనిజులా విడుదల చేసింది. బుధవారం నాడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ.. తాను డెల్సీ రోడ్రిగ్జ్‌తో చాలాసేపు మాట్లాడానని చెప్పారు. 'మేము అనేక సమస్యలపై చర్చించాము. ముఖ్యంగా అమెరికా, వెనిజులా సంబంధాలు సరైన దిశలో వెళుతున్నాయని భావిస్తున్నాను' అన్నారు

## పల్నాడులో వైసీపీ కార్యకర్త హత్య...

**గుంటూరు,** పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మందా సాల్మన్ హత్యోదంతం పల్నాడులో ఉద్రిక్తలకు కారణం అ?యంది. గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ కార్యకర్త మందా సాల్మన్ అనారోగ్యంతో ఉన్న తన భార్యను చూసేందుకు సొంత గ్రామానికి వచ్చిన సాల్మన్‌ను ప్రత్యర్థులు ఇనుప రాడ్లతో కొట్టి చిత్రహింసలకు గురిచేశారు.

తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మరణించడంతో పిన్నెల్లిలో ఉద్రిక్తత ఏర్పడింది. ఈ ఘటనను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ ప్రోత్సాహంతో జరిగిన రాజకీయ హత్యేనని ధ్వజమెత్తారు. సాల్మన్ హత్యపై స్పందిస్తూ వైఎస్ జగన్ ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. చంద్రబాబుకు పరిపాలించడానికి అర్హులేనా? రెడ్‌బుక్ రాజ్యాంగం ముసుగులో ఎంతమంది ప్రాణాలను బలితీసుకుంటారు అంటూ ప్రశ్నించారు. బాధితుడిపైనే తప్పుడు కేసులు పెట్టడం దారుణమని, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆయన ఆరోపించారు. రాజకీయ కక్షల కోసం సామాన్య పేదల ప్రాణాలను తీయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని, ఈ హింసా రాజకీయాలకు చంద్రబాబు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని జగన్ హెచ్చరించారు.

పిన్నెల్లిలో పరిస్థితి అత్యంత భయానకంగా తయారైందని, కేవలం రాజకీయ విభేదాల కారణంగా వందలాది వైఎస్ఆర్ సీపీ కుటుంబాలు గ్రామాన్ని వదిలి పారిపోవాల్సిన దుస్థితి ఏర్పడిందని స్థానిక నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అండతోనే ఈ అరాచకాలు జరుగుతున్నాయని, పోలీసులు సైతం అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఆరోపించారు. గ్రామంలో భయానక వాతావరణం సృష్టించి ప్రతిపక్ష కార్యకర్తలను ఊళ్ల నుంచి తరిమివేస్తున్నారని, ఈ మారణకాండకు ముఖ్యమంత్రే బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. హత్యకు గురైన సాల్మన్ కుటుంబానికి వైఎస్ఆర్ సీపీ అన్ని విధాలా అండగా ఉంటుందని పార్టీ ప్రకటించింది. పల్నాడు ప్రాంతంలో జరుగుతున్న వరుస దాడులపై జాతీయ స్థాయిలో గళం విప్పుతామని, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేసింది. సంక్రాంతి పండుగ వేళ జరిగిన ఈ హత్యతో పల్నాడులో ఉద్రిక్తత కొనసాగుతోంది, పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

## గాదె ఇన్నయ్య తల్లి థెరిసమ్మ కన్నుమూత

**హైదరాబాద్,** మాజీ మావోయిస్టు, సామాజిక ఉద్యమకారుడు, 'మా ఇల్లు ప్రజాదరణ ఆశ్రమ' నిర్వాహకుడు గాదె ఇన్నయ్య తల్లి థెరిసమ్మ కన్నుమూశారు. వయోభారం, అనారోగ్య సమస్యలతో ఆమె తుదిశ్వాస విడిచారు. ఆమె అంత్యక్రియలు శనివారం జరగనున్నాయి. గత ఏడాది కాలంగా ఇన్నయ్య తన తల్లి వద్దే ఉంటున్నారు. అయితే, ఎన్ఐఏ కేసులో ఇటీవలే ఇన్నయ్య అరెస్ట్ అయ్యారు. మావోయిస్టులకు అనుకూలంగా మాట్లాడుతూ ప్రజలను ప్రేరేపిస్తున్నారనే ఆరోపణలతో ఆయనను ఉపా (యూఏపీఏ) చట్టం కింద అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ లోని చంచల్ గూడ జైల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో, తన తల్లి చివరి చూపుకు ఆయనకు అవకాశం లభిస్తుందా? లేదా? అనే చర్చ జరుగుతోంది.

## జిల్లా హౌసింగ్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ మాణిక్యం ను సన్మానించిన

### తుక్కాపూర్ గ్రామ సర్పంచ్ ఆంజనేయులు



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని తుక్కాపూర్ గ్రామంలో శుక్రవారం నాడు మెదక్ జిల్లా హౌసింగ్ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ మాణిక్యం తుక్కాపూర్ గ్రామాన్ని సందర్శించి వారికి గ్రామ సర్పంచ్ శాలువతో సన్మానించారు తదుపరి గ్రామంలో పర్యటించి ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి బాధితులను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధన ప్రకారం మాత్రమే ఇండ్ల నిర్మాణం నిర్మించుకోవాలని తెలిపారు వారి వెంట హౌసింగ్ ఏఈ సుష్మ, గ్రామ సర్పంచ్ ఆంజనేయులు, ఉప సర్పంచ్ ఆరె రవీందర్, మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి లో గిరి ప్రదక్షిణ

శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీ కాళహస్తి భూప్రదక్షిణ కూడా దైవారాధనతో సమానమే. ప్రసిద్ధ క్షేత్రాల్లో ఆ ప్రాంతమంతా దైవస్వరూపంగా భావించి, చుట్టూ ప్రదక్షిణం చేయడం మన సంప్రదాయం. దక్షిణకైలాసం అయిన శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంక్రాంతి మరునాడు కనుమ నాడే శ్రీకారం. ఆరోజున స్వామి, అమ్మవార్లు నందివాహనారూఢులై గిరిప్రదక్షిణ మార్గంలో ఊరేగుతూ తమ కల్యాణానికి దేవతలను, సిద్ధులను, సాధుసత్పురుషులను స్వయంగా ఆహ్వానిస్తారు. భక్త కన్నప్పకు ఆహ్వానపత్రికను అందిస్తారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవం జరిగిన తరువాత వారే మళ్లీ మరోసారి పిలిచినవారందరికీ వీడ్కోలు పలుకుతారు. స్వామి అమ్మవార్లు చేసే ఈ గిరిప్రదక్షిణను భక్తులు ప్రతిమాసంలోనూ పౌర్ణమినాడు సాధారణంగా చేస్తుంటారు. అరుణాచల గిరిప్రదక్షిణ వలె శ్రీకాళహస్తి గిరి ప్రదక్షిణ కూడా ప్రాచీనకాలం నుంచి ఉన్నప్పటికీ ఈ మార్గం మాత్రం అంతటి ప్రసిద్ధం కాలేదు. దాదాపు 21 కిలోమీటర్ల దూరం ఉండే గిరిప్రదక్షిణ మార్గంలో ఇప్పటికీ కొంతదూరం తారురోడ్డులోనూ, మరికొంతదూరం మట్టిరోడ్డుపైనా ప్రయాణించవలసి వస్తోంది. శ్రీకాళహస్తి ప్రధానాలయం తూర్పుద్వారం అయిన నాలుగోనెంబర్ గేటు దగ్గర గిరిప్రదక్షిణ ప్రారంభిస్తారు. సవ్యమార్గంలో ఉత్తరంవైపు నడిచి చివరకు దక్షిణద్వారం మీదుగా నాలుగో గేటువద్దకు రావడంతో గిరిప్రదక్షిణ పూర్తవుతుంది. ఈ ప్రదక్షిణ మార్గంలో శ్రీశైలంలోని భరద్వాజ తీర్థం వంటి దాదాపు 30 తీర్థాలు మనకు కనిపిస్తాయి. కన్నప్ప గుడికొండను చుట్టి, వేయిలింగాల కోన, హరిహరతీర్థం, దక్షిణకాళీ కొండలను చుట్టుకుంటూ ఈ గిరిప్రదక్షిణ కొనసాగుతుంది.నేడు కనుమ పండగ సందర్భంగా శ్రీకాళహస్తీస్వర స్వామి అమ్మవార్ల గిరిప్రదక్షిణలో పాల్గొని



గాలిగోపురం దగ్గర నుంచి మొదల పెట్టి తిరిగి ఎదురుసేవ మండపం వరకు నడక మార్గంలో గిరి ప్రదక్షిణ పూర్తి చేయడం జరుగుతుంది కనీవినీ ఎరుగని రీతిలో వేలాదిగా తరలివచ్చిన భక్తులు భక్తులతో గిరి ప్రదక్షిణ రోడ్డు కిటకిటలాడింది భక్తులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు గిరి ప్రదక్షిణకు శ్రీకాళహస్తి దేవస్థానం ప్రధాన ఆలయం నుండి శ్రీ స్వామి అమ్మ వార్ల సంక్రాంతి కనుమ కైలాసగిరి ప్రదక్షణ ను ఈ రోజు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దంపతులు, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, సభ్యులు గుర్రప్ప శెట్టి, గోపీనాథ్, రాఘవయ్య, స్పెషల్ ఇన్వైటిస్ వెంకట రామా నాయుడు, శైలజ, ఆలయ కార్యనిర్వహణధికారి టి బాపి రెడ్డి దంపతులు, శ్రీకాళహస్తి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు గార్లచే ప్రారంభించడమైనది.సదర కార్యక్రమం నందు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దంపతులు,



ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, సభ్యులు గుర్రప్ప శెట్టి, గోపీనాథ్, రాఘవయ్య, స్పెషల్ ఇన్వైటీస్ ఇన్వైటిస్ వెంకట రామానాయుడు, శైలజ, ఆలయ కార్యనిర్వహణధికారి బాపి రెడ్డి దంపతులు, శ్రీకాళహస్తి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు, కోలా ఆనంద్, డి ఈ ఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి ఆలయ అధికారులు భక్తులు పాల్గొన్నారు.

## జి రాంజీ పథకాన్ని రద్దు చేయాల్సిందే.

### బూడిద గణేష్ డిమాండ్



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మండలం బిట్టుపల్లి గ్రామంలో వరి నాట్లు వేస్తున్న కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరుతో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి పార్లమెంటు తమకున్న మందబలంతో జి రామ్ జి పేరుతో పథకాన్ని పార్లమెంట్లో ఆమోదించుకున్నారని అన్నారు 60 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని ఈ పథకంలో చెప్పారని అన్నారు ఉపాధి పనులను కూలీలతో కాకుండా కాంట్రాక్టర్లకు అప్పజెప్పి యంత్రాల ద్వారా పనులు చేస్తారని అన్నారు.దీంతో గ్రామాల్లో కూలీలకు పని దొరికే పరిస్థితి లేదని అన్నారు గ్రామీణ ప్రజలకు ఆసరగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడం సరి కాదన అన్నారు కూలీల పని హక్కుకు భంగం కలిగిస్తున్న జిరాంజీ పథకాలు రద్దు చేయాల్సిందేనని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ మేట్ రమేష్ తో పాటు కూలీలు పాల్గొన్నారు

## పొట్ట కోసం పాలేరు పని చేస్తే

# పిడి గుద్దులు...చిత్రహింసలా....

- పోలీసులంటే భరోసా ఇవ్వాలే కానీ అవమానపరుస్తరా
- ఎవరిని కాపాడేందుకు చట్టాలు అమలు చేస్తుండ్లు
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని ( ప్రశ్న న్యూస్) పొట్ట కూటికోసం పాలేరు పని చేస్తే యజమాని పిడిగుద్దులు, చిత్ర హింసలకు గురి చేయడం ఏంటని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ప్రశ్నించారు. కడుపు కోసం పాలేరుగా పనిచేస్తున్న గంధం రాజబాబును అదే గ్రామానికి చెందిన యజమాని గడ్డం వెంకటరాజం కొట్టడమే కాకుండా చిత్రహింసలకు గురి చేశాడని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఇప్పటి వరకు ఇంక్వైరీ పేరిట పోలీసులు కాలయాపన చేస్తున్నారని పుట్ట మధు పేర్కొన్నారు. శుక్రవారం గంధం రాజబాబును ఆయన పరామర్శించి వివరాలు పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధితుడు రాజబాబు పోలీస్ స్టేషన్లో దరఖాస్తు ఇవ్వడానికి వెళ్తే ఎస్సై దరఖాస్తు తీసుకోకుండా ఈ రోజు ఫిర్యాదు చేసి రేపు నీవు డబ్బులు తీసుకొని అతనితో కాంప్రమైజ్ అవుతావని బాధితునికి అవహేళన చేస్తూ, అవమానపరిచాడని అన్నారు. భారతదేశంలో ఇప్పటి వరకు కుల వివక్ష కొనసాగుతుందని ఇది దీనికి నిదర్శనం అని అన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ ఆక్ట్ ప్రభుత్వాలు, చట్టాలు ఇంత కూడా ఎస్సీ ఎస్టీలకు వర్తించటం లేదని , ఎవ్వరిని అవమానపరిచినా శిక్షించడం లేదన్నారు. ఈ సంఘటన జరిగినా ఇప్పటివరకు మహాముత్తారం మండలంలో కాంగ్రెస్ లీడర్లను



కాపాడుతున్నారని ఆయన ఆరోపించారు. బి ఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాలన జరిగిందని, కానీ ఈనాడు ఎస్సీ ఎస్టీలను వాడుకొని రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఎమ్మెల్యే ఆ కేసులు మాత్రం ఇప్పటి వరకు బయటకు తీయకుండా వారిపైనే దాడులను



ప్రోత్సహిస్తున్నాడని ఆరోపించారు. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌లో మార్పు ఎప్పుడొస్తుందోనని, పోలీస్ స్టేషను కాంగ్రెస్ పార్టీ కార్యాలయంగా మార్చిన చరిత్ర నీదేనని ఆయన అన్నారు. పిటిషన్లు ఇవ్వడానికి పోలీస్ స్టేషన్ కి వస్తే అనేక చిన్న చిన్న విషయాలలో ఇబ్బందికి గురి చేస్తున్నాడని మండల ప్రజలు ఆరోపిస్తున్నారని ఆయన అన్నారు. ఇంత పెద్ద అవమానం జరిగి ఒక కుటుంబం రోడ్డు పాలై ప్రమాదానికి గురైందని, దుద్దిళ్ల శ్రీధర్ ఆయన తమ్ముడు శీను బాబు అండగా ఉంటూ కాపాడుతారని ధైర్యంతో ఇలా ప్రవర్తిస్తున్నారని ఆయన అన్నారు. ఇప్పటికైనా మంథని ఎమ్మెల్యే తన ఆలోచనలు మార్చుకోని, రాజబాబు కుటుంబానికి న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఆయన హితవు పలికారు.

## మాఘ అమావాస్య సందర్భంగా, ఏడుపాయల్లో భద్రత ఏర్పాటు పరిశీలించిన

### అదనపు ఎస్పీ ఎస్. మహేందర్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) ఏడుపాయల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా, బ్యారికేడింగ్, పార్కింగ్ ప్రదేశాలు, భక్తులు ఉపయోగించే క్యూలైన్‌ల నిర్వహణను సమీక్షించారు. మొత్తం బొందొబస్త్ సుమారు 250 మంది సిబ్బందితో ఏర్పాటు చేయబడిందని తెలిపారు.నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోకి, భక్తులు తెలియని లోతట్టు ప్రదేశాలకు వెళ్లకూడదని, పోలీసులు సూచించిన సురక్షిత ప్రదేశాల్లోనే స్నానాలు చేయాలని స్పష్టం చేశారు.

అదేవిధంగా, దేవాలయం ప్రాంగణంలో భక్తులు దర్శించుకునే క్యూలైన్‌లను పరిశీలించారు. భక్తులు స్నానం చేసే ప్రమాదకర ప్రాంతాలను సూచించే విధంగా సూచికలను ఏర్పాటు చేయాలని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని, అన్ని ఏర్పాట్లను జాగ్రత్తగా అమలు చేయాలని అదనపు ఎస్పీ అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ వెంట మెదక్ రూరల్ సీఐ జర్జ్, కూల్చారం ఎసై అహ్మద్ మోహినొద్దీన్ మరియు ఆలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## స్వర్గీయ నామోజు దేవమ్మ వర్ధంతి

## - ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన సేవలు

- గత 1731 రోజులుగా నిరంతర అన్నదాన సేవలు
- ట్రస్ట్ నిర్వాహకులు : డాక్టర్ మధు మహేష్





వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణానికి చెందిన “మై వేములవాడ ట్రస్టు” ఆధ్వర్యంలో దాతల సహకారంతో గత 1731 రోజులుగా కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద 150 మంది పేదలు, భక్తులకు అన్నదానం నిర్వహించారు.వరంగల్ వాస్తవ్యులు,స్వర్గీయ నామోజు దేవమ్మ వర్ధంతిని పురస్కరించుకొని ఆమె కుమారుడు-కోడలు నామోజు జగన్నాధాచారి-యాక లక్ష్మీ దంపతులు, మనుమడు-మనుమరాలు నామోజు కనకచారి-విజయలక్ష్మి దంపతులు శుక్రవారం అన్నదాతలుగా నిలిచి అన్నదాన సేవలందించారు. శాశ్వత దాతలుగా డా. జువ్వాడి వెంకటేశ్వరరావు-స్నేహలత, ప్రతాప్-స్వప్న-సంపత్, నగుబోతు రవీందర్-జ్యోతి, గణాచారి మఠం శైలజ-సాంబశివు, దేవరాజు ఉమ-బాలచందర్ రాజు, రామడుగు శ్రీలత తదితరులు సహకరించారు. అలాగే వారి కొడుకులు-కోడళ్లు ప్రజ్ఞ-శరత్‌చంద్ర, శిరీష-సాయిచంద్ర, శర్వాణి--రవిచంద్ర దంపతులు, హైదరాబాద్ వాస్తవ్యులు చిన్నారులు శ్రీహర్ష, సాయికృష్ణ కూడా పాల్గొన్నారు. పుట్టినరోజులు, పెళ్లిరోజులు వంటి శుభ సందర్భాల్లో పేదలకు ఒక్కపూటైనా భోజనం అందించాలనుకునే దాతలు ట్రస్టు సభ్యులను సంప్రదించాలని ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ మధు మహేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు,నిర్వాహకులు డాక్టర్ మధు మహేష్ తోపాటుగా ట్రస్ట్ సభ్యులు వొడ్యాల వేణు, పాత సంతోష్, ప్రతాప్ నటరాజు, సగ్గు రాహుల్, పసుల శ్రీధర్, గొట్టం శ్రీనివాస్, నామాల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## తడగొండ లో “బంధంకుంట”

## ప్రభుత్వ అక్రమ భూమిపై అక్రమ సర్వే పూర్తి

- చెరువు నీటి నిల్వకు ముప్పు - బాధ్యులపై చర్యలు తీసుకుంటాం
- మండల రెవెన్యూ అధికారులు - రైతుల హర్షం - కృతజ్ఞతలు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని తడగొండ గ్రామంలో బంధం కుంట వద్ద ప్రభుత్వ భూమి (సర్వే నెం. 435)పై అక్రమ ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు సర్వే పూర్తి చేశారు. మొత్తం 6 ఎకరాలు 18 గుంటల ప్రభుత్వ స్థలంలో సుమారు 2 ఎకరాలు 20 గుంటలు కొందరు సమీప రైతులు హద్దులు, ఖనీలు తొలగించి ఆక్రమించినట్లు గ్రామ రైతులు ఫిర్యాదు చేశారు.గతంలో (2016) అప్పటి సర్పంచ్ కట్ట కనుకమ్మ మండల సర్వేయర్ ద్వారా హద్దులు పాతించి రెడ్ మార్కింగ్ చేయించినప్పటికీ, మళ్లీ అక్రమ సాగు కొనసాగుతోందని రైతులు తెలిపారు. ఫిర్యాదు మేరకు శుక్రవారం మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మనోజ్ సర్వేయర్‌తో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.అక్రమ ఆక్రమణ వల్ల చెరువు నీటి నిల్వ సామర్థ్యం తగ్గి, సమీప రైతుల బావులు, పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు చిందం రమేష్, బుర్ర రాజు, ముదాం శ్రీనివాస్, కట్ట లచ్చయ్య, మహిపాల్‌లు, అంబేద్కర్ సంఘం సభ్యులు పాల్గొన్నారు. సమస్యపై వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్‌కు, మండల తహశీల్దార్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## మృతుని కుటుంబానికి పరామర్శ
# ఆర్థికసాయం అందజేత



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రానికి చెందిన బొడ్డు పర్శరాములు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మండలంలోని బూరుగుపల్లి గ్రామ సర్పంచ్ పెంచాల సౌమ్య--మహేష్ దంపతులు మృతుని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు ప్రగాఢ సంతాప సానుభూతి వ్యక్తం చేస్తూ రూ.6 వేల నగదు ఆర్థికసాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డు రజనికృష్ణ--తిరుపతి, పెరుక మహేష్,బొడ్డు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## బోయినిపల్లి మండల అభివృద్ధిపై
# బీజేపీ నేతల విజ్ఞప్తి

- నాగులమల్యాల - వేములవాడ డబుల్ రోడ్డుకు
- భరోసా ఇచ్చిన కేంద్రమంత్రి బండి



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) భారతీయ జనతా పార్టీ బోయినిపల్లి మండల శాఖ అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ ఆధ్వర్యంలో మండల నాయకులు, కార్యకర్తలు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ ను శుక్రవారం కలుసుకొని మకర సంక్రాంతి,కనుమ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బోయినిపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కోసం అవసరమైన నిధులపై నాయకులు వివరించగా, అతి త్వరలోనే మండలానికి తగిన నిధులు కేటాయిస్తామని బండి సంజయ్ భరోసా ఇచ్చారు. అలాగే నాగులమల్యాల నుంచి బోయినిపల్లి మీదుగా వేములవాడ వరకు ఉన్న సింగిల్ బీటీ రోడ్డును డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందిస్తూ, ఆ పనిని కూడా వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ భేటీలో స్తంభంపల్లి సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నర్సింహాచారి, మాజీ మండలాధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు సుంకపాక చక్రవర్తి, జువ్వెంతుల శ్రీనివాస్ రెడ్డి, కొండమ్ శ్రీనివాస్ రెడ్డి, మెరుపుల గంగాధర్ గౌడ్, పసికంటి వెంకటేష్, మారం ఉపేందర్, అన్నమల్ల మోహన్ బాబు, సారంపల్లి రాజు, ఇల్లందుల బాలయ్య, జనగామ లక్ష్మణ్, ఐలయ్య, ముసుకు విజయేందర్ రెడ్డి, నవీన్, కిరణ్, తిరుపతి, రాజు, మహేశ్, రమేశ్, ఆంజనేయులు, సాయికుమార్, కట్ట విజయ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెక్ పవర్ లేక బ్యాంకుల్లో
# నిలిచిన సిబ్బంది వేతనాలు

- గ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాలు వెంటనే చెల్లించాలని వినతి
- ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి : కడారి రాములు



వేములవాడ (ప్రశ్న న్యూస్) గ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు ఆధ్వర్యంలో సంఘ నాయకులు వేములవాడ అర్బన్ మండల అభివృద్ధి అధికారికి (ఎంపీడీఓ) వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కడారి రాములు మాట్లాడుతూ గత రెండు నెలలుగా గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఒక నెల వేతనాలు విడుదలైనప్పటికీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు చెక్ పవర్ లేకపోవడంతో ఆ మొత్తాలు బ్యాంకుల్లోనే నిలిచిపోయాయని వాపోయారు. చెక్ పవర్ ఎప్పుడు ఇస్తారో స్పష్టత లేకపోవడంతో పండగ సమయానికీ సిబ్బంది పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వేతనాలు వచ్చి కూడా తీసుకోలేని దుస్థితి నెలకొందని పేర్కొంటూ, ఈ సమస్యకు తక్షణ పరిష్కారంగా ఎంపీడీఓ ప్రత్యేక అధికారాలు వినియోగించి గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# ప్రభుత్వాన్ని మెల్కొల్పి ప్రజల కష్టాలు తీర్చడంలో ముందుండాలే...

- వ్యక్తిగతం కంటే యూనియన్‌గా ఉంటేనే ప్రయోజనం
- ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్‌క్లబ్‌కు నావంతు సహకారం అందిస్తా
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్







మంథని ( ప్రశ్న న్యూస్) ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రభుత్వాన్ని మేల్కొల్పి ప్రజల కష్టాలు తీర్చడంలో ముందుండాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మంథని డివిజన్ కేంద్రంలో నూతనంగా ఏర్పాటైన ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ ప్రెస్‌క్లబ్‌ను ఆయన సందర్శించి నూతన కమిటిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగతం కంటే యూనియన్‌గా ఉండటంతో అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. తనకు సైతం అందరూ ఐక్యంగా ఉండాలని, కలిసి ఉండటం అంటేనే తనకు చాలా ఇష్టమన్నారు. అయితే దేశంలో మీడియా ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని, దేశంలో నాలుగో స్థంభంగా పేరున్న మీడియా ప్రజలకు మేలు చేసేలా పనిచేయాలన్నారు. ప్రభుత్వంతో పాటు ప్రతిపక్షం కూడా సరైన రీతిలో స్పందించేలా నడిపించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ఎలక్ట్రానిక్ మీడియా చాలా వేగంగా ప్రతి సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. నియోజకవర్గం విస్తీర్ణంలో చాలా పెద్దదని, ఈ క్రమంలో ప్రజాప్రతినిధులు, పత్రికలు మీడియా అలసత్వం వహించవద్దని ఆయన సూచించారు. ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ ప్రెస్‌క్లబ్‌కు తనవంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని, అలాగే బీఆర్ఎస్ పార్టీ సైతం అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# భక్తి సంప్రదాయాల పరిరక్షణే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యం

- ఆలయాల అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి
- మేడారం జాతరకు ముందు రాజన్న దర్శనం ఆనవాయితీ - మంత్రి సీతక్క





వేములవాడ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా భక్తుల విశ్వాసాలు, సంప్రదాయాలకు అనుగుణంగా ఆలయాల అభివృద్ధి, విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి,గ్రామీణ నీటి పారుదల,మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఈ కార్యక్రమాలన్నింటినీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తూ అవసరమైన నిధులు సమకూర్చుతున్నారని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణంలోని శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మంత్రి సీతక్క ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే ఘన స్వాగతం పలికారు. అర్చకులు పూర్ణకుంభంతో ఆహ్వానించి, కోడె మొక్కు చెల్లింపుతో పాటు స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం గాయత్రి మాత దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధిక భక్తుల రద్దీ ఉండే ఆలయాల్లో మౌలిక వసతుల పెంపే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయం విస్తరణకు రూ.150 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని, వీటి ద్వారా భక్తులకు సులభ దర్శనం, మెరుగైన సౌకర్యాలు త్వరలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అదేవిధంగా మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర గద్దెల పునర్నిర్మాణం, అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. ఆదివాసీ సంప్రదాయాలు, భక్తుల విశ్వాసాలను కాపాడేలా రూ.200 కోట్లకు పైగా నిధులు కేటాయించి పనులు చేపట్టినట్టు వెల్లడించారు. ఈ నెల 18న సీఎం రేవంత్ రెడ్డి మేడారం వెళ్లి అక్కడే కేబినెట్ సమావేశం నిర్వహించనున్నారని, 19న జాతర పనులకు అధికారికంగా శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు.మేడారం జాతరకు ముందు వేములవాడ రాజన్న దర్శనం ఆనవాయితీగా వస్తోందని, అందులో భాగంగానే తాను ఆలయానికి వచ్చానని మంత్రి సీతక్క పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తల్లులను దర్శించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి,ఏఎస్పీ రుత్విక్ సాయి, వేములవాడ ఆర్డీఓ రాధాభాయి, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్‌ను కలిసిన
# విలాసాగర్ సర్పంచ్ కనుకయ్య

- శ్రీ మహాశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు
- బండి సంజయ్ తో కలిసి దర్శనం
- గ్రామాభివృద్ధికి కేంద్రమంత్రి హామీ
- బండికి కనుకయ్య కృతజ్ఞతలు





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామ సర్పంచ్ ఏనుగుల కనుకయ్య శుక్రవారం బండి సంజయ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రితో కలిసి చైతన్యపురిలోని శ్రీ మహాశక్తి ఆలయంలో అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విలాసాగర్ గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను సర్పంచ్ కనుకయ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, మంత్రి సానుకూలంగా స్పందించి తగిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ కనుకయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు విలాసాగర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కాకా వెంకటస్వామి మెమోరియల్ T20 లీగ్ మ్యాచ్‌ను ప్రారంభించిన .

ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, TGIIC చైర్‌పర్సన్ నిర్మల జగ్గా రెడ్డి.




మంథని ( ప్రశ్న న్యూస్) పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ కృష్ణ, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్‌పర్సన్ శ్రీమతి నిర్మల జగ్గా రెడ్డితో కలిసి, కాకా వెంకటస్వామి మెమోరియల్ T20 క్రికెట్ లీగ్‌లో భాగంగా ఆదిలాబాద్ - ఖమ్మం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌ను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, సంగారెడ్డి జిల్లా - సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలోని చిమల్దారి కోనాపూర్ గ్రామంలో ఉన్న క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువతలో క్రీడల ద్వారా క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, ఆరోగ్యకరమైన పోటీ భావన పెంపొందుతాయని తెలిపారు. అలాగే, తెలంగాణ వ్యాప్తంగా జిల్లా స్థాయి క్రీడా ప్రతిభను వెలికితీయడంలో ఇలాంటి టోర్నమెంట్లు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొంటూ, టోర్నమెంట్ నిర్వాహకులను అభినందించారు. కాకా వెంకటస్వామి మెమోరియల్ T20 లీగ్ యువతను క్రీడల వైపు ఆకర్షించి రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేస్తూ, పాల్గొంటున్న అన్ని జట్లకు ఆటగాళ్లకు ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, చైర్‌పర్సన్ నిర్మల జగ్గా రెడ్డి గార్లు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ అధికారులు, నిర్వాహకులు, ఆటగాళ్లు, క్రీడాభిమానులు స్థానిక ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## క్రీడల పట్ల యువత ఆసక్తి కనబరచాలి గెలుపొందిన జట్టులకు బహుమతులను ప్రధానం చేసిన

కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఊశయ్య



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కిష్టాపూర్ గ్రామంలో క్రికెట్ టోర్నమెంటును మల్కె శ్రీధర్ జ్ఞాపకార్థంతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు గత మూడు రోజుల నుండి నాలుగు టీమ్ల జట్టులు ఆటలో హోరాహోరీగా పోటీపడి గురువారం నాడు రెండు టీముల ఫైనల్ కు చేరగా రెండు జట్ల టీములను హోరాహోరీగా పోటీపడ్డారు, గెలుపొందిన జట్టులకు క్రికెట్ టోర్నమెంటు స్పాన్సర్ మల్కె గణేష్ యాదవ్, మరియు గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఉషయ్య, బహుమతులను అందజేశారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఊశయ్య మాట్లాడుతూ గత మూడు రోజుల నుండి కిష్టాపూర్ గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది ఈ క్రికెట్ మ్యాచ్ చూడటానికి గ్రామంలో చిన్న పెద్ద అని తేడా లేకుండా అందరూ ఉత్సాహంగా మ్యాచును తిలకించారు ఈ ఆటలో గెలుపు ఓటములు సహజమేనని ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల ఆసక్తి చూపాలని యువకులకు గ్రామ సర్పంచ్ పిలుపునిచ్చారు మరియు గ్రామస్థాయి కాకుండా మండల స్థాయి మరియు జిల్లా స్థాయిలో మంచిగా రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని యువకులకు గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఉషయ్య పిలుపునిచ్చారు మరియు యువకులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి మార్గంలో నడవాలని తెలిపారు యువకులు క్రీడల పట్ల మరియు చదువు పట్ల ఆసక్తి కనబరిచి తల్లిదండ్రులకు గాను గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఉషయ్య తెలిపారు తదుపరి రెండు జెట్ల కెప్టెన్లను మరియు క్రికెట్ టోర్నమెంట్ స్పాన్సర్ను మల్కె గణేష్ యాదవ్ ను శాలువతో సన్మానించిన గ్రామ సర్పంచ్ స్వప్న ఉశయ్య ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చందపురం నిర్మల శేఖర్ యాదవ్, బిజెపి పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎంచర్ల శేఖర్ యాదవ్, కొల్చారం మండలం బిజెపి మండల ఉపాధ్యక్షులు వడ్ల చంద్రశేఖర్, వార్డు మెంబర్స్ తోశ నవీన్, అక్కిం ప్రవీణ్ యాదవ్, బొక్కల శేఖర్ యాదవ్, కిష్టాపూర్ డీలర్ దుర్గయ్య, కాశమ్మ సాయిరాజ్, అక్కె శ్యామ్,మల్కె శ్రీశైలం యాదవ్, నాగుల గారి దుర్గా గౌడ్, చాకలి ప్రభాకర్, వడ్ల సంతోష్, గ్రామ ప్రజలు యువకులు తదితరులు పాల్గొన్నారు.




## బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చిన ధనుష్..

హీరోగా మాత్రమే కాదు.. దర్శకుడిగానూ తన సత్తా చాటుతూ కోలీవుడ్‌లో ఫుల్ ఫామ్‌లో దూసుకుపోతున్నాడు ధనుష్. వరుస ప్రాజెక్ట్స్‌తో అభిమానులకు పండగ తీసుకొస్తున్నారు. గతేడాది కుబేర, ఇడ్లీ కడై, తేరే ఇష్క్ మే వంటి సినిమాలతో ప్రేక్షకులను మెప్పించిన ధనుష్, వరుసగా మూడు హిట్స్ సాధించి కెరీర్‌లో మరో గోల్డెన్ ఫేజ్‌లోకి అడుగుపెట్టారు. ఈ విజయాల ఊపుతో ఆగకుండా, ప్రస్తుతం 'ఴ-54' అనే క్రేజీ ప్రాజెక్ట్‌తో బిజీగా ఉన్నారు ధనుష్. విఘ్నేష్ రాజా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ధనుష్ సరసన మమిత బైజు హీరోయిన్‌గా నటించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది.

ఈ జంట మొదటిసారి కలిసి నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఈక్రమంలో.. తాజాగా, సంక్రాంతి సందర్భంగా మూవీ మేకర్స్ బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. 'ఴ-54' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు అధికారికంగా 'కర' అనే టైటిల్‌ను ఫిక్స్ చేస్తూ, పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ధనుష్ ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తూ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నారు. పోస్టర్‌పై కనిపించిన "కొన్నిసార్లు ప్రమాదకరంగా ఉండటమే ప్రాణాలతో బ్రతకడానికి ఉన్న ఏకైక మార్గం" అనే ట్యాగ్‌లైన్ సినిమాపై క్యూరియాసిటీని పెంచింది. ఇది పక్కా ఇంటెన్స్ యాక్షన్ డ్రామా అనే సంకేతాలను ఇచ్చింది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఒకేసారి విడుదలకు సిద్ధమవుతున్న 'కర' మూవీ ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ చిత్రాన్ని సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. వరుస విజయాలతో దూసుకుపోతున్న ధనుష్‌కు 'కర' కూడా మరో బ్లాక్‌బస్టర్ అవుతుందని అంతా అభిప్రాయపడుతున్నారు.

## నాగ బంధం నుంచి
# క్రేజీ బ్యూటీ పోస్టర్ రిలీజ్..



విరాట్‌కర్ణ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'నాగబంధం'. అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కిషోర్ అన్నపురెడ్డి నిర్మిస్తున్నారు. నభా నటేష్, ఐశ్వర్యమీనన్, జగపతిబాబు తదితరులు నటిస్తున్న ఈ సినిమా పురాతన దేవాలయాలు, నిధుల అన్వేషణ నేపథ్యంలో ఒక పౌరాణిక యాక్షన్ అడ్వెంచర్ డ్రామాగా తెరకెక్కుతుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన అప్డేట్స్ అన్నీ మూవీపై అంచనాలు పెంచగా.. తాజాగా క్రేజీ బ్యూటీ నభా నటేష్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా.. 'రహస్యాలతో బంధించబడిన ప్రపంచంలో, ఆమె నమ్మకం విధిగా మారుతుంది.. నాగబంధం నుండి పార్వతిగా అందమైన నభా నటేష్‌ని పరిచయం చేస్తున్నాము.. ఈ సమ్మర్‌లో థియేటర్లలో పాన్-ఇండియా మూవీ నాగ బంధం విడుదల కానుంది' అని రాసుకొచ్చారు. ఇక పోస్టర్‌లో పార్వతి అనే పేరుకు తగ్గట్టుగానే నభా పార్వతీ దేవీలా ఉంది. ఒంటినిండా నగలతో మహా రాణిని తలపిస్తుంది. ఇక పిట్టను ఎక్కడికి పోతున్నావు అన్నట్లుగా నభా సైగ చేస్తున్నది. ఆమె వెనక ఓ పెద్ద దేవాలయం, చెట్లు వాటికి పూసిన పూలు, నెమలి అంతా చాలా డివోషనల్ వైబ్‌ను తెప్పిస్తున్నాయి. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



## వివాదంలో చిక్కుకున్న సాయిపల్లవి సినిమా

నేచురల్ బ్యూటీగా ఇండస్ట్రీలో ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకున్న సాయి పల్లవి, గ్లామర్ షోలకు దూరంగా ఉంటూనే తన నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకుంది. తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో వరుస విజయాలతో స్టార్ స్టేటస్‌ను అందుకున్న ఆమె, సంప్రదాయ లుక్స్‌తోనే ప్రేక్షకులను ఆకట్టుకుంటూ తనకంటూ ఓ బ్రాండ్ ఇమేజ్‌ను క్రియేట్ చేసుకుంది. 'లవ్ స్టోరీ', 'అమరన్ణ వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాలతో పాటు, గతేడాది వచ్చిన 'తండేల్ణ సినిమాతో మరోసారి తన నటనా ప్రతిభను నిరూపించింది. రియల్ లైఫ్ ఇన్‌స్పైర్డ్ కథతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీసు వద్ద ఘన విజయం సాధించి సాయి పల్లవిని మరో లెవెల్‌కు తీసుకెళ్లింది. ఇక త్వరలో 'రామాయణ' సినిమాలో కీలక పాత్రతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలోనే.. సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీపై ఆసక్తికర చర్చ మొదలైంది. 'ఏక్ దిన్ణ అనే టైటిల్‌తో రూపొందుతున్న ఈ హిందీ చిత్రంతో రాబోతుంది. ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాను ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. సునీల్ పాండే దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం మే 1న థియేటర్లలో విడుదల కానుంది. తాజాగా, ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ కావడంతో ఒక్కసారిగా సోషల్ మీడియాలో హీట్ పెరిగింది. ఐస్‌క్రీమ్‌తో కనిపించిన సాయి పల్లవి, జునైద్ జంట లుక్ అందరినీ ఆకట్టుకున్నప్పటికీ, అదే సమయంలో వివాదానికి దారితీసింది. 2016లో విడుదలైన థాయ్ రొమాంటిక్ డ్రామా 'వన్ డే'కు ఈ పోస్టర్ చాలా దగ్గరగా ఉందని నెటిజన్లు ఆరోపిస్తున్నారు. టైటిల్ నుంచి పోస్టర్ వరకూ అన్నీ సేమ్‌గా ఉన్నాయని, ఇది రిమేక్? అంటూ సోషల్ మీడియాలో ట్రోల్స్ మొదలయ్యాయి. అంతేకాకుండా, గతంలో ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్ నుంచి వచ్చిన లాల్ సింగ్ చద్దా, లవ్ యప్పా, సితారే జమీన్ పర్ సినిమాల ఫలితాలను ప్రస్తావిస్తూ.. 'ఏక్ దిన్ణ కూడా అదే బాటలో బాక్సాఫీస్ వద్ద ఫెయిల్ అవుతుందంటూ కొందరు నెటిజన్లు విమర్శలు చేస్తున్నారు.

## ఓటీటీలోకి 'శంబాల'..



ఆది సాయికుమార్ నటించిన మిస్టిల్ థ్రిల్లర్ మూవీ 'శంబాల'. 2025 డిసెంబరులో బాక్సాఫీసు వద్ద సందడి చేసిన ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీ ఖరారైంది. 'ఆహా'లో ఈనెల 22 నుంచి స్ట్రీమింగ్ కానుంది. 'ఆహా గోల్డ్' సబ్‌స్క్రిప్షన్ ఉన్నవారు ఒక రోజు ముందుగా చూసే అవకాశం ఉందని సదరు సంస్థ సోషల్ మీడియాలో ప్రకటించింది. యుగంధర్ ముని దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అర్చన అయ్యర్ హీరోయిన్. 1980వ దశకం నేపథ్యంలో సాగే కథ ఇది. వెయ్యేళ్ల చరిత్ర ఉన్న ఓ ఊరు శంబాల. అక్కడ ఆకాశం నుంచి ఓ ఉల్క పడుతుంది. అప్పటినుంచి ఊరిలో అనూహ్యమైన సంఘటనలు జరగడం మొదలవుతాయి. ఉన్నట్టుండి ఎవరో ఒకరు విచిత్రంగా ప్రవర్తిస్తూ హత్యలు చేస్తారు, ఆత్మహత్యలకు పూనుకుంటుంటారు. దాంతో బండ భూతం ఆవహించిందంటూ ఊరి జనం భయంతో వణికిపోతుంటారు. మూఢ నమ్మకాలు రాజ్యమేలుతాయి. ఆ రహస్యాలను ఛేదించేందుకు ప్రభుత్వం విక్రమ్ (ఆది సాయి కుమార్) అనే యువ శాస్త్రవేత్తని ఆ గ్రామానికి పంపిస్తుంది. సైన్స్‌నే నమ్ముకుని విధులు నిర్వర్తించే విక్రమ్ ఆ ఊళ్లో జరుగుతున్న సంఘటనల వెనక రహస్యాల్ని ఛేదించాడా? ఆ ఊరిలో కనిపించిన దేవి (అర్చన అయ్యర్) ఎవరు? విక్రమ్ నమ్ముకున్న సైన్స్‌కీ, ఊరి చరిత్ర వెనకున్న శాస్త్రానికి మధ్య సంఘర్షణ ఎలా సాగిందన్నది మిగతా కథ.

## పెళ్లి అయిపోయిందంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను..

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ చెల్లెలు నుపుర్ సనన్ ఇటీవల వివాహ బంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. ప్రముఖ గాయకుడు స్టెబిన్ బెన్ ను నుపుర్ తన జీవిత భాగస్వామిగా ఎంచుకోగా ఉదయ్‌పూర్‌లో కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య ఈ పెళ్లి ఎంతో ఘనంగా జరిగింది. ఈ నేపథ్యంలో తన చెల్లిని తలుచుకుని కృతి సనన్ సోషల్ మీడియాలోఎమోషనల్ పోస్ట్ చేసింది. నుపుర్‌తో కలిసి దిగిన ఫొటోలను షేర్ చేస్తూ.. ఆమె లేనిదే ఇంట్లో ఖాళీగా, వెలితిగా అనిపిస్తోందని చెప్పుకొచ్చింది. "నాకు ఐదేళ్ల వయసున్నప్పుడు నిన్ను తొలిసారి చేతుల్లోకి తీసుకున్న క్షణం నుంచి.. నేడు నీ పెళ్లిలో నీ తలపై పూల చాదర్ పట్టుకుని నిన్ను వధువుగా చూడడం వరకు కాలం ఎంత వేగంగా పరుగెత్తిందో అర్థమైంది. నువ్వు నిన్ను ప్రాణంలా ప్రేమించే వ్యక్తితో కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్నప్పుడు నా గుండె గర్వంతో నిండిపోయింది. నా చిన్న తల్లికి పెళ్లయిందంటే ఇంకా నమ్మలేకపోతున్నాను" అంటూ కృతి తన మనసులోని భావాలను వ్యక్తం చేసింది. అలాగే, చెల్లెలి భర్త స్టెబిర్ బెన్‌ను ఉద్దేశిస్తూ.. "స్టెబు, నువ్వు ఇక మా కుటుంబ సభ్యుడివే. నీ రూపంలో నాకు ఒక తమ్ముడు, మంచి స్నేహితుడు దొరికాడు. మీరు ఇద్దరూ పెళ్లి ప్రమాణాలు చేసుకుంటున్నప్పుడు అది నా జీవితంలోనే అత్యంత ఎమోషనల్ మూమెంట్ణ' అని పేర్కొంది. చెల్లి నుపుర్ గురించి మాట్లాడుతూ.."నువ్వు దగ్గర్లోనే ఉంటావని నాకు తెలుసు. కానీ నీ నవ్వులు లేని ఇల్లు ఇప్పుడు బోసిపోయినట్టుగా అనిపిస్తోంది. నువ్వు ఇప్పుడు రెండు ఇళ్లలో ఆనందాన్ని పంచబోతున్నావు. లవ్ యూ టు ది మూన్ అండ్ బ్యాక్ణ' అంటూ కృతి ఎమోషనల్‌గా అయింది. ఇక దీనికి నుపుర్ "కృత్సూ నువ్వే నా ప్రపంచం, నా లైఫ్ లైన్. ఆ పూల చాదర్ చాలా బరువుగా ఉందని అందరూ అన్నారు. కానీ, దాన్ని పట్టుకోవాల్సింది నువ్వేనని నాకు తెలుసు. సోదరిగా, సోదరుడిగా, నా ధైర్యంగా, నా చిన్న తల్లిగా నువ్వు నాకు చేసిన ప్రతిదీ నా మనసులో పదిలంగా ఉంది. లవ్ యూ అక్కా" అంటూ రిప్లై ఇచ్చింది. ప్రస్తుతం ఈ రెండు పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ.. అక్కాచెల్లెలి బంధాన్ని గుర్తు చేస్తున్నాయి.



## ఆద్యంతం ఎంజాయ్ చేస్తున్నారు



రవితేజ నటించిన తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. కిషోర్ తిరుమల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మించారు. ఈనెల13న గ్రాండ్‌గా విడుదలైన ఈ సినిమా సంక్రాంతి బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుని హౌస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సంక్రాంతి బ్లాక్‌బస్టర్ మీట్ నిర్వహించారు.నిర్మాత సుధాకర్ చెరుకూరి మాట్లాడుతూ, 'మా సినిమాని ఇంత పెద్ద హిట్ చేసిన తెలుగు ప్రేక్షకులందరికీ థ్యాంక్స్. మా హీరో రవితేజకి, హీరోయిన్స్‌కి, మా సినిమాలో నటించిన అందరికీ ధన్యవాదాలు. అలాగే మా టెక్నీషియన్స్ ప్రకాష్, ప్రసాద్, బీమ్స్, కొరియోగ్రాఫర్స్, రైటర్స్ అందరికీ చాలా థ్యాంక్స్. నేను రెండుసార్లు భ్రమరాంభ థియేటర్‌కి వెళ్ళాను. ఫ్యామిలీ ఆడియన్స్, పిల్లలు చాలా ఎంజారు చేస్తున్నారు. ఈ సినిమా టికెట్ రేట్లు అందరికీ అందుబాటులో ఉండే ధరల్లోనే ఉన్నాయి. తెలంగాణలో సింగిల్ స్క్రీన్స్ రూ. 175, మల్టీప్లెక్స్ రూ. 200, ఆంధ్రాలో సింగిల్ స్క్రీన్ రూ.195, మల్టీప్లెక్స్ రూ.250 ఉన్నాయి. అందరూ ఫ్యామిలీతో కలిసి వెళ్లి ఎంజారు చేయండి' అని తెలిపారు. 'బిగినింగ్ నుంచి చివరి వరకు ప్రేక్షకులను నవ్వించాలనే ఉద్దేశంతో తీసిన సినిమా. మేము అనుకున్న టార్గెట్‌ని 100% రీచ్ అయ్యాం. ఆడియన్స్ నాన్ స్టాప్‌గా నవ్వుతున్నారు. అన్ని పాత్రలు కూడా హిలేరియస్‌గా ఉన్నాయి. నా సినిమాలు ఫ్యామిలీ ఆడియన్స్ హ్యాపీగా చూడొచ్చు అని అంటారు. ఈ సినిమాతో ఆ ఆడియన్స్ డబుల్ అయ్యారు. ఈ సినిమా అందరికీ ఇంత బాగా నచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. ఆడియో బ్లాక్‌బస్టర్ అయిందంటే ఆ క్రెడిట్ అంతా బీమ్స్‌కి వెళుతుంది. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా నెక్స్ట్ లెవెల్ ఇచ్చారు' అని డైరెక్టర్ కిషోర్ తిరుమల చెప్పారు.

# ఈ వైభవం ఆరంభం మాత్రమే:యం ఎల్ ఏ నసీర్

- ప్రతి ఏటా గుంటూరు తూర్పులో సంక్రాంతి సంబరాలునిర్వహిస్తామన్న ఎమ్మెల్యే నసీర్
- అద్భుత రీతిలో సాగిన సంబరాలు - తరలివచ్చిన కళాకారులు, క్రీడాకారులు
- క్రీడా పోటీలో విజేతలకు రూ.5 లక్షల విలువైన బహుమతులు అందజేత
- హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కూటమి నాయకులు



**గుంటూరు (ప్రశ్న న్యూస్ )** తూర్పు నియోజకవర్గంలో ఎన్నడూలేని విధంగా మన గుంటూరు మన సంక్రాంతి సంబరాలు వైభవంగా సాగాయి. స్థానిక ప్రజానీకానికి ఉత్సాహం నింపేలా ఏర్పాటు చేసిన ఈ సంబరాల్లో కళాకారులు, క్రీడాకారులు తమ ప్రతిభాపాటవాలతో అలరించారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ ఆధ్వర్యంలో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన మన గుంటూరు- మన సంక్రాంతి సంబరాల లో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో చేపట్టిన సంక్రాంతి సంబరాల్లో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. చరితాత్మకంగా నిర్వహించిన సంక్రాంతి సంబరాలను విజయవంతం చేసిన సుమారు 140 మందికిపైగా క్రీడాకారులు, వెంగమాంబ ట్రస్ట్ సభ్యులు, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో దశాబ్దాలుగా వెనుకబడిన గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో తీసుకెళుతుందన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని రాబోయే తరాలకు అందించేలా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఈ సంక్రాంతి వైభవం ఆరంభం మాత్రమేనని, మరింత ఉత్సాహంతో నియోజకవర్గ ప్రజల కోసం అహర్నిశలు పాటుపడతానని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సాంస్కృతిక కార్యక్రమాలకు పెద్ద పేట వేస్తున్నామని చెప్పారు గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇలాంటి గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం మంచి విషయమని పేర్కొన్నారు.

### ఉప్పొంగిన సంతోషాలు

నింగికెగరే శాంతి కపోతాలు ఉప్పొంగే ఆప్యాయతా అనురాగాలు ఇంటి ముంగిట కల్లాపి జల్లులు గడప ముంగిట చుక్కల ముగ్గులు ముగ్గుల్లో ముస్తాబైన గొబ్బిళ్లు.. హరిదాసుల సంకీర్తనలు.. కోలాటం, జానపదం, సాంస్కృతిక సంబరాలు.. గిల్లికర్ర, ఏడు పెంకుటాల, మ్యూజికల్ చైర్స్, తాడు లాగుట, క్రికెట్ వంటి సరదా క్రీడలు.. ముచ్చటగా మూడు రోజులపాటు గుంటూరు తూర్పు నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమాలు గుండె గుండెల్లో సంతోషాన్ని నింపాయి. మ్యూజికల్ నైట్ కార్యక్రమాలు అలరించాయి.

### రూ.5 లక్షల విలువైన బహుమతులు ప్రదానం

మూడు రోజులపాటు నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో రూ. 5 లక్షల విలువైన బహుమతులను ప్రదానం చేశారు.

ఈ కార్యక్రమం లో ఎమ్మెల్సీ ఆలపాటి రాజా ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్ బాబు గల్లా మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు, బిజెపి జిల్లా అధ్యక్షుడు తిరుపతి రావు తదితరులు హాజరయ్యారు.

## వేసవి కాలంలో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు



**నిజామాబాద్(ప్రశ్న న్యూస్)** నిజమాబాద్ జిల్లాలో రాబోయే వేసవి కాలంలో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్ అంకిత్ మిషన్ భగీరథ , పంచయతిరాజ్ డిపార్ట్మెంట్ లతో సమావేసం తీసుకున్నారు. వచ్చే ఫిభ్రవరి 1వ తేదీ లోపు అన్ని గ్రామాలలో మంచినీటి , పారిశుద్ధ్య కమిటీలను ఏర్పాటు చెసుకుని నీటి సరఫర తీరు నిశితంగా పరిశీలించాలని, ఫిభ్రవరి 1 నుండి 20 వ తారీఖు వరకు స్పెషల్ డ్రైవ్ జరిపించడానికి ఆదేశాలు జారీ చేస్తూ అన్ని మండల ఎం.పీ.ఓ , మిషన్ భగీరథ ఏ.ఈ లు మండల స్థాయి బృందాలుగా ఏర్పడి మండలంలోని అన్ని గ్రామాలలో సర్పంచ్ , సెక్రటరీలతో కలసి అన్ని వీదులలో పర్యటించి గ్రామంలో నీటి సమస్యలను గుర్తించి , కార్యాచరణ ప్రణాలిక సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామాలలో నీటి సమస్యలు ఎదురైతే రాష్ట్ర స్థాయి టోల్ ఫ్రీ నెం. 1916 కు కాల్ చేసి అధికారుల ద్రుష్టికి తీసుకురావాలని తెలియచేసారు. ఈ సమావెశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, మిషన్ భగీరథ ఎస్.ఈ రాజేందర్, ఈ.ఈ లు రాకేష్, నరేష్ , స్వప్న, , అన్ని మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ఎన్నికలతో మహారాష్ట్రలో బిజెపి అఖండ విజయం

- ఇందూరులో ఇదే విజయం పునరావృతం ఖాయం



**నిజామాబాద్(ప్రశ్న న్యూస్)** ఓటు బ్యాంకు కోసం హిందూ దేవతలను అడ్డుపెట్టుకొని గద్దెనెక్కిన కాంగ్రెస్ ఆ తర్వాత మన దేవతలపై అవహేళన చేస్తున్న ఆ పార్టీకి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ అన్నారు.మహారాష్ట్ర ఫలితాలతో నగరంలో కార్యకర్తలు నాయకులతో కలిసి అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ సంబరాలు జరుపుకున్నారు.గురువారం మహారాష్ట్ర లో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి పార్టీతో కలిసిన మహాయుతి పార్టీ 29 కార్పొరేషన్ స్థానాలకు గాను 26 కార్పొరేషన్ స్థానాలు సాధించి బిజెపి పార్టీ అఖండ విజయం సాధించిందని ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. ఈ విజయం కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు లాంటిదని రాష్ట్రంలో కూడా త్వరలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో ఇవే ఫలితాలు పునరావృతం కానున్నాయని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ దేవతలపై ఒట్టేసి గద్దెనెక్కిన తర్వాత హిందూ దేవతలపై అవహేళనగా మాట్లాడడాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని రాబోయే కొద్ది రోజుల్లోనే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ముఖ్యంగా ఇందూర్ మున్సిపల్ కార్పొరేషన్ పై బిజెపి జెండా ఎగరవేయడం ఖాయమని ఆయన అన్నారు. మహారాష్ట్రలో కూడా మొదటగా హిందూ దేవతల పైన ముస్లింలకు వ్యతిరేకంగా పోరాడిన శివసేన పార్టీ కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకుని ప్రస్తుతం ఆ పార్టీకి మహారాష్ట్రలో అడ్రస్ లేకుండా పోయిందని ఆయన విమర్శించారు.

## రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాయిని లక్ష్మారెడ్డికి ఘన సన్మానం



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులను శుక్రవారం జిల్లా కేంద్రంలో శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా బోయినిపల్లి మండలంలోని ఆనంతపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వార్డు సభ్యుడిగా గెలుపొందిన నాయిని లక్ష్మారెడ్డిని ప్రత్యేకంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్పర్సన్ న్యాలకొండ అరుణ, కొండ దేవయ్య పటేల్ తో పాటు రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరం పై సీసీఎస్ టీం మెరుపు దాడి



**నిజామాబాద్(ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ పోలీస్ కమీషనర్ సాయి చైతన్య, ఆదేశాల మేరకు సీసీఎస్ ఏ.సీ.పీ ఇంచార్జ్ మస్తాన్ ఆలి సూచనల మేరకు ఎస్ఐగోవింద్ , సిబ్బంది కలిసి నిజామాబాదు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగస్థాన్ పేస్ -1 లో గల సాయి రుద్వి అపార్ట్మెంట్ లో పేకాట స్థావరం పై రైడ్ చేసి 7 గురు పేకాట రాయుళ్ళు ను, 7 సెల్ ఫోన్స్ , నగదు 22,060/- స్వాధీనం చేసుకొని తదుపరి చర్య నిమిత్తం నిజామాబాదు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఎచ్ఓకి అప్పగించారు.

## మున్సిపల్ వార్డుల మహిళా రిజర్వేషన్ల ఖరారు

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టరేట్ లో డ్రా
- బిజిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి



**నిజామాబాద్(ప్రశ్న న్యూస్)** మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ జిల్లాలోని నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు భీంగల్, ఆర్మూర్, బోధన్ మున్సిపాలిటీల వార్డులకు మహిళా రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఈ నెల 17న (శనివారం) గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ డ్రా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. భీంగల్ మున్సిపాలిటీకి సంబంధించిన వార్డుల మహిళా రిజర్వేషన్ల ఖరారు కోసం ఉదయం 10.00 గంటలకు డ్రా నిర్వహిస్తామని అన్నారు. అదేవిధంగా ఆర్మూర్ మున్సిపాలిటీ వార్డుల ఖరారుకై ఉదయం 10.15 గంటలకు, బోధన్ మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్ల ఖరారు కోసం ఉదయం 10.30 గంటలకు, నిజామాబాద్ నగర పాలక సంస్థ డివిజన్లలో మహిళా రిజర్వేషన్ల ఖరారు కోసం ఉదయం 11.00 గంటలకు డ్రా ప్రక్రియ కొనసాగుతుందని సూచించారు. ఈ సమావేశానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ కోరారు.

## యువతకు మార్గదర్శకంగా నిలిచిన శివ చారి

- ఐటీబీపీ కానిస్టేబుల్ గా శివ చారి ఎంపిక - ఘన సన్మానం - ఎడపల్లి బాబు
- సామాజికసేవల నుండి సరిహద్దు భద్రత వరకు యువమిత్ర సభ్యుడి ప్రస్థానం



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండల కేంద్రానికి చెందిన యువ మిత్ర యూత్ సభ్యుడు బ్రహ్మకంటి శివచారి ఐటీబీపీ కానిస్టేబుల్ (జీఏ)గా ఎంపిక కావడంతో గ్రామంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన ఎడపల్లి బాబు శుక్రవారం యువ మిత్ర యువజన సభ్యులతో కలిసి శివచారిని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా ఎడపల్లి బాబు మాట్లాడుతూ,"బోయినిపల్లి యువత 'యువ మిత్ర'గా సంఘటితమై క్రీడా,విద్య, ఉద్యోగాలు,సామాజిక సేవలు, అవసరంలో ఉన్నవారికి ఆర్థికసాయం వంటి కార్యక్రమాలు చేపట్టడం ప్రశంసనీయం. అలాంటి సంఘం నుంచి బ్రహ్మకంటి శివచారి ఐటీబీపీ కానిస్టేబుల్గా ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణం. ఆయన క్రమశిక్షణతో దేశసేవ చేస్తూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని, ఈ విజయం గ్రామ యువతకు మార్గదర్శకంగా నిలవాలని కోరుకుంటున్నాం" అన్నారు.ఈ కార్యక్రమంలో యువ మిత్ర యూత్ సభ్యులు చౌదరి శ్రీధర్, బొజ్జ శ్రీకాంత్, తునికి రాజు, మధు, అరవింద్,గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొని శివ చారిని అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

## రెంజల్ పీ.హెచ్.సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**నిజామాబాద్(ప్రశ్న న్యూస్)** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకాన్ని పెంపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. రెంజల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసెప్షన్ సెంటర్, ఇన్ పేషంట్, ల్యాబ్, డిస్పెన్సరీ, ఫార్మసీ, ఇమ్యూనైజేషన్ రూమ్, తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది గురించి ఆరా తీసిన కలెక్టర్ అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో వైద్యులు లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పేషంట్ల వివరాలతో కూడిన రిజిస్టర్ పరిశీలించి, వారికి అందించిన ఔషధాలను గమనించారు. ప్రతి రోజు ఎంత మంది పేషంట్లు వస్తున్నారు, స్థానికంగానే కాన్పులు చేస్తున్నారా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శీతలీకరణలో ఉంచాల్సిన వ్యాక్సిన్లను రిఫ్రిజిరేటర్ లో భద్రపరిచారా లేదా అని తనిఖీ చేశారు. డిస్పెన్సరీలో నిలువ ఉన్న ఔషధాల గడువు తేదీ, వాటి నాణ్యతను పరిశీలించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా అంకిత భావంతో విధులు నిర్వహించాలని హితవు పలికారు. వైద్యులు, సిబ్బంది విధుల్లో.అందుబాటులో ఉంటూ, మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

## పేకాట స్థావరంపై సిసిఎస్ టీం మెరుపు దాడి



**నిజామాబాద్ (ప్రశ్న న్యూస్)** శుక్రవారం సాయంకాలం సమయంలో నిజామాబాద్ పోలీస్ కమీషనర్ పి.సాయి చైతన్య ఐ పి యస్ ఆదేశాల మేరకు (సిసిఎస్) ఏ.సీ.పీ ఇంచార్జ్ మస్తాన్ ఆలి గారి సూచనల మేరకు యస్ ఐ గోవింద్,సిబ్బంది కలిసి నిజామాబాదు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగస్థాన్ పేస్ 1 లో గల సాయి రుద్వి అపార్ట్మెంట్ లో పేకాట స్థావరం పై రైడ్ చేసి 7 గురు పేకాట రాయుళ్ళు ను, 7 సెల్ ఫోన్స్ , నగదు 22,060/- స్వాధీనం చేసుకొని తదుపరి చర్యల నిమిత్తం నిజామాబాదు రూరల్ పోలీస్ స్టేషన్ లో అప్పగించడం జరిగింది.

## మిరాజ్ వింటర్ ఉత్సవమేేల

# పర్యావరణ హత్యకు వేదిక

- హుస్సేన్ సాగర్ తీరంలో దోపిడీకి నిలయంగా మారిందన్న ప్రజలు
- అవినీతి అక్రమాలకు సహకరిస్తున్న బుద్ధ పూర్ణిమ ప్రాజెక్ట్ అధికారులు.?
- హుస్సేన్ సాగర్ లో మలమూత్రాల విసర్జన లపై కథనం రావడంతో తొలగింపు
- 2నెలలుగా అధికారుల పర్యవేక్షణ కరువైందా.? లేక నిర్వహణదారులకు దాసోహం అయ్యిందా.?
- అధికారులలో మాటలలో వినిపిస్తున్న నీతి నిజాయితీ చేతులలో ఎక్కడా లేకపాయే
- వర్క్ ఆర్డర్ లో రెండు నెలలు సమయం ఇచ్చిన అధికారులకు, 3 రోజులు ఎక్కువ తేదీలు ఫ్లెక్సీలు వేసిన కనిపించలేదా.?



"ప్రజాప్రశ్న" కథనం తర్వాత తొలగించిన పురుషుల మూత్రశాల


ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక
మీరాజ్ వింటర్ ఉత్సవ మేళాతో
హుస్సేన్ సాగర్‌కు ముప్పు,
ఫైర్ సేఫ్టీ పై నిర్లక్ష్యం..
14 Jan 2026 | Prajaprashna Epaper | Page 5
Source: https://epaper.prajaprashna.com/

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ అధికారులు అంటే అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ గా మారుతున్నారన్న ఆరోపణలకు పీపుల్స్ ప్లాజా వ్యవహారం చూస్తే నిజమే అనిపిస్తుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల మాటల్లో ఉన్న నీతి నిజాయితీ చేతలలో ఎక్కడా కనిపించడం లేదు. హుస్సేన్ సాగర్ ప్రక్షాళన కోసం ప్రభుత్వం కోట్లు ఖర్చు చేస్తుంటే అధికారులు బాధ్యతారాహిత్యంతో దానిని మంటగల్పుతున్నారు. స్వలాభం కోసమా.? లేక నిర్లక్ష్యమా.? అన్నది ఉన్నత అధికారులే తేల్చాలి. అధికారుల బాధ్యతారాహిత్యం నిర్లక్ష్యం అవినీతి అక్రమాలపై పత్రికలలో కథనాలు వస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరించడంతో రాష్ట్రంలో పాలన కుంటుబడిందా.? లేక కనుమరుగవుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్ గుండెకాయ లాంటి హుస్సేన్ సాగర్ నేడు మరోసారి నిర్వాహకుల నిర్లక్ష్యానికి, అధికారుల మౌనానికి బలవుతోంది. హుస్సేన్ సాగర్ తీరంలో నిర్వహిస్తున్న మిరాజ్ వింటర్ ఉత్సవమేలలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక మూత్రశాలల మురుగు నీరు నవంబర్ 15 నుంచి జనవరి 18 వరకు నేరుగా జలాశయంలోకి కలుస్తోంది. ఇది కేవలం తప్పిదమా.? లేక ప్రణాళికాబద్ధమైన పర్యావరణ నేరమా.? అన్న ప్రశ్నలు ప్రజలను కలవరపెడుతున్నాయి.

నియమాలు స్పష్టంగా ఉన్నప్పటికీ, పర్యావరణ అనుమతులు, మురుగు నీటి శుద్ధి ఏర్పాట్లు, శానిటేషన్ నిర్వహణ వంటి మౌలిక అంశాలను గాలికొదిలేశారు. వేలాది మంది సందర్శకులు వచ్చే ఉత్సవంలో మురుగు నీరు నేరుగా సరస్సులోకి వదలడం ప్రజారోగ్యానికి, జీవవైవిధ్యానికి తీరని నష్టం. అయిన ఈ అక్రమాలపై బుద్ధ పూర్ణిమ ప్రాజెక్ట్ అధికారులు కాలుష్య నియంత్రణ మండలి, ఈవెంట్ అనుమతులు ఇచ్చిన శాఖలు ఎందుకు కళ్లుమూస్తుకున్నాయి.?

ఇంతకాలం కొనసాగుతున్న ఈ అక్రమాలపై ఒక్క నోటీసు లేదు.? ఒక్క సీజ్ చర్య లేదు.? ఒక్క హెచ్చరిక లేదు.? ఇది అధికారుల అజ్ఞానమా.? లేక నిర్వాహకులతో ఉన్న అప్రకటిత అనుబంధమా.? ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎవరిది.? హుస్సేన్ సాగర్‌ను రక్షిస్తామంటూ వేదికలెక్కే పాలకులు, అధికారుల మాటలకు ఈ దృశ్యాలే జవాబు.పర్యావరణ చట్టాలు కాగితాలకే పరిమితమా.? ప్రజారోగ్యం తాత్కాలిక ఉత్సవాల కంటే తక్కువదా.? ఒకవైపు శుద్ధి, పునరుద్ధరణ పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ, మరోవైపు ఇలాంటి ఉత్సవాల



హుస్సేన్ సాగర్ లోకి ఏర్పాటు చేసిన పురుషుల మూత్రశాల (ఫైల్ ఫోటో)

పేరుతో సరస్సులో మురుగు నీరు కలపడం ఏమిటి.? ప్రభుత్వ ద్వంద్వ వైఖరి ఎవరి లాభం కోసం.? అని ప్రజలు ప్రశ్నలు కురిపిస్తున్నారు "ప్రజాప్రశ్న" దినపత్రికలో కథనం రావడంతో నిర్వాహకులు పురుషులు వెళ్లే మూత్రశాలని వెంటనే తొలగించారు. మహిళలది మలం వెళ్లే వాటిని మాత్రం ఇంకా మూసి వేయకపోవడంతో అధికారుల బాధ్యతారాహిత్యం ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు అధికారులకు, నిర్వాహకులకు అంతర్గత ఆర్థిక లావాదేవీలు ఉండడంవల్లే ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

### బుద్ధ పూర్ణిమ ప్రాజెక్ట్ పై అధికారులది బాధ్యతారాహిత్యమా.? లేక ..

అక్రమ మూత్రశాలల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది ఎవరు.? మురుగు నీరు సరస్సులోకి వెళ్తున్నప్పటికీ చర్యలు తీసుకోని అధికారి ఎవరు.?

పర్యావరణ నష్టానికి బాధ్యత ఎవరు తీసుకుంటారు.? బుద్ధ పూర్ణిమ ప్రాజెక్ట్ ఓఎస్‌డి ప్రసాద్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శ్రీవాణి బాధ్యతారాహిత్యం వల్లే నవంబర్ 15 నుండి జనవరి 18 తారీకు వరకు నిర్వహణ జరుగుతుందంటే ఎన్ని వేల మంది హుస్సేన్ సాగర్లోకి మలమూత్రాలు వదిలారో ఉన్నత అధికారులకే తెలియాలి.ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హెచ్ఎండిఏ కమిషనర్, ఉన్నత అధికారులు మేల్కొని తక్షణమే అక్రమ ఏర్పాట్లను తొలగించి, మురుగు నీటి ప్రవాహాన్ని నిలిపివేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ప్రస్తుతం నిర్వహిస్తున్న నిర్వాహకులకు ఈ స్థలాన్ని ఎట్టి పరిస్థితిలో కేటాయించవద్దు. లేకపోతే హుస్సేన్ సాగర్ మరోసారి అధికారుల మౌనంతోనే కలుషితమవుతుంది.

### నిర్వహణ తేదీలో గందరగోళం.. వర్క్ ఆర్డర్ బహిర్గతం చేయని వైనం..

ఉత్సవ మేళాలో అధికారుల వివరాల ప్రకారం నవంబర్ 15 నుండి జనవరి 15 వరకు మాత్రమే నిర్వహించాలి. దానికి ప్రతిరోజు ఒక లక్ష రుసుము 18 శాతం జీఎస్టీ నిర్వాహకులు చెల్లించాలి. అయితే మేళా నిర్వహణకు ఐదు రోజులు ముందు, ఐదు రోజులు తరువాత సామాగ్రిని బిగించుకోవడానికి, విప్పడానికి కేటాయిస్తారు. అయితే నిర్వాహకుడు అధికారుల అవినీతినా.? నిర్లక్ష్యనా.? ఆసరాగా చేసుకుని మేళాను మూడు రోజులు (జనవరి 18 వరకు) నిర్వహిస్తామని ప్రచారం చేశారు. మేళా ఫ్లెక్సీ ల పై కూడా నవంబర్ 15 నుండి జనవరి 18 వరకు మేళా నిర్వహిస్తున్నట్లు పెట్టారు. అయితే అధికారుల అనుమతు లేకుండా నిర్వాహకుడు మూడు రోజులు ముందే ఎలా పెట్టాడు. గతంలో ఇలా ఎన్ని అవినీతి అక్రమాలకు పాల్పడ్డారో.? ఈ అవినీతి అక్రమాల వెనుక ఎంత సొమ్ము చేతులు మారిందో.? మూడు రోజుల ఎక్కువ నిర్వహణలో రోజుకు లక్ష చొప్పున చెల్లిస్తారని అధికారులు తెలిపారు.

హెచ్ఎండిఏ బుద్ధ పూర్ణిమ ప్రాజెక్ట్ అధికారులు కళ్ళు మూసుకోవడం వెనుక ఆర్థిక లావాదేవీలే అన్న అనుమానాలు బలపడుతున్నాయి. మరి ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంటారో.?

### పార్కింగ్ పేరుతో దోపిడి..

మిరాజ్ వింటర్ ఉత్సవ మేళా పేరుతో అధికారులు ఎంత స్థలం కేటాయించారు.? దానికి పార్కింగ్ స్థలం ఎక్కడ.? ట్రాఫిక్ పోలీసులు, ఫైర్ సేఫ్టీ అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారు.? తదుపరి వివరాలను అధికారులు పూర్తిస్థాయిలో తెలపకపోవడం చూస్తూ ఉంటే నిర్వాహకులతో హెచ్ఎండిఏ అధికారులకు లోపాయి కారి ఒప్పందాలు బాగానే ఉన్నట్లు ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇంకో




ఇప్పటికీ అలాగే ఉన్న పురుషుల, మహిళల మరుగుదొడ్లు

అయితే దానికి నిర్వహకునికి ప్రారంభించెనాటికే మూడు రోజులను ఎక్కువగా ప్రకటించుకున్నప్పుడు, అధికారుల అనుమతి లేదు కదా, మరి నిర్వాహకుడు ఎలా సొంతంగా ప్రకటించుకున్నాడు.? అధికారుల దృష్టికి ఇన్ని రోజులు రాలేదా.? అంటే అధికారులు డ్యూటీ చేస్తున్నారా.? లేక నిర్వాహకులకు అమ్ముడుపోయారా.? అన్న అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. నిర్వాహకుడు తనకు ఇష్టం వచ్చినట్లు తేదీలని ప్రకటించుకుంటే మరి ప్రభుత్వ నియమనిబంధనలు ఎందుకు కాగితాల కేనా.? వర్క్ ఆర్డర్ ఎందుకు కాగితాలకేనా.? ఓ ఎస్ డి ది ఇంత నిర్లక్ష్యమా.? అధికారుల పర్యవేక్షణ ఎలాగో లేదు ఇలాంటి నిర్వహణ వల్ల ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం కంటే అధికార నిర్లక్ష్యంతో ప్రభుత్వానికి, పర్యావరణానికి చేస్తున్న నష్టమే ఎక్కువ అన్నది పాలకులకు అర్థం కాకపోవడం విస్మయాన్ని కలిగిస్తుందిని పర్యావరణ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టు వ్యవహారాలపై కళ్ళముందు అవినీతి బాగోతం జరుగుతుంటే ఇటు ప్రభుత్వం అటు విషయం ఏమిటంటే ఇప్పటివరకు అధికారులు అక్కడ ఏం జరుగుతుందన్నది ఒక్కరోజు కూడా చూసిన పాపాన పోలేదు అందుకోసమే మలమూత్ర శాలలను హుస్సేన్ సాగర్ లో కలిపిన పార్కింగ్ పేరుతో దోపిడీ చేస్తున్న పాదాచారులు నడిచే రోడ్లపై అక్రమ పార్కింగ్లు చేస్తున్న అధికారులు పట్టించుకోలేదంటే దాని వెనుక ఎంత బాధ్యతారాహిత్యమో లేక అంతర్గత ఒప్పందమో ప్రభుత్వానికే తెలియాలి. ఏది ఏమైనా పీపుల్ ప్లాజా లో ప్రజల శ్రేయస్సు కోసం ఉపయోగించాల్సిన స్థలంలో ప్రభుత్వ ఆదాయం అంటూ అధికారుల అక్రమ సొమ్ముతో జేబులు నింపుకుంటున్నారన్న ప్రజల అనుమానాలు నిజమవుతున్నాయి. ప్రభుత్వానికి ఇప్పటికైనా చిత్తశుద్ధి ఉంటే గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ జరుగుతున్న అవినీతి అక్రమాల బాగోతంపై పూర్తిస్థాయిలో ఏసీబీ విచారణ చేపిస్తే కానీ అధికారుల అవినీతి అక్రమాలు, నిర్వాహకుల బాధ్యతారాహిత్యం హుస్సేన్ సాగర్ కలుషితం పై పూర్తిస్థాయి వివరాలు వెలుగులోకి వస్తాయి.

# ఎన్‌సీసీ గేటు వద్ద ఫుట్ పాత్, రోడ్డు కబ్జా

- అక్రమ వ్యాపారాలతో ట్రాఫిక్ జామ్ - వాహనదారులకు, పాదాచారులకు నిత్యం నరకమే
- అధికారుల చర్యలు మూడునాళ్ల ముచ్చటగానే
- ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవహరించాలని వాహనాదారుల విన్నపం
- మున్సిపల్ అధికారులు శాశ్వతంగా తొలగించాలని కోరుతున్న స్థానికులు



**ఓయూ (ప్రశ్న న్యూస్)** ఉస్మానియా యూనివర్సిటీ ఎన్ సిసి గేట్ వద్ద ఫుట్ పాత్, రోడ్డు కబ్జా చేసి అక్రమ వ్యాపారాలు నిర్వహించడంతో తీవ్రంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ పార్కింగ్, అక్రమ వ్యాపారాల నిర్వహణను పూర్తిగా తొలగించి ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించి యూనివర్సిటీ విద్యార్థులకు, అధికారులకు, ప్రజలకు ఇబ్బందులు కలవకుండా ట్రాఫిక్‌ను పటిష్టంగా నియంత్రించాల్సిన బాధ్యత గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులది, ట్రాఫిక్ పోలీసులది ఉన్నప్పటికీ రోజురోజుకు ఇక్కడి పరిస్థితి కి ప్రజలకు తీవ్రమైన ఇబ్బందిగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో అధికారులు వాటిని తొలగించిన తిరిగి వారం రోజుల లోపే యధావిధిగా వ్యాపారాలు నిర్వహించడం వల్ల స్థానికులకు చాలా ఇబ్బందులు కలుగుతున్నాయని ఇది ఒక అక్రమ వ్యాపార కేంద్రంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న షట్టర్ తీసుకొని రోడ్డుపైనే వ్యాపారం చేస్తున్నారని రోడ్డును డైనింగ్ టేబుల్ గా మార్చడం, ట్రాన్స్ఫర్ వద్ద గ్యాస్ సిలిండర్ స్టౌ ఏర్పాటు చేయడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతోందో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం బాధాకరంగా మారిందని స్థానికులు మండిపడుతున్నారు. రహదారులపై అక్రమంగా వ్యాపారం చేయడం,



వాహనాలు పార్క్ చేయడం, చౌరస్తా రోడ్డు కావడంతో డిడి కాలనీ కి వెళ్లే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. వ్యాపారులు, వ్యక్తిగత వాహనదారులు పాదచారుల రోడ్డుపై వాహనాలు పార్క్ చేసి ట్రాఫిక్‌ను మరింత ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ కారణంగా ట్రాఫిక్ జామ్స్ ఏర్పడటం, అత్యవసర రవాణా సేవలకు అడ్డంకులు కలగడం చాలా సాధారణమైంది. అక్రమ పార్కింగ్ అధికజనం ఉండటం వల్ల ట్రాఫిక్ పోలీసులు, టౌన్ ప్లానింగ్ అధికారులే దీనిపై గట్టి చర్యలు తీసుకోకపోవటంపై స్థానికులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

### రోడ్లపై నిత్యం వ్యాపారాలే..

ఫుట్‌పాత్ ఆక్రమణ చేసి వ్యాపారాలు, వాణిజ్య






కార్యకలాపాలు పాదచారులకు ఉండాల్సిన ఫుట్ పాత్ ను, రోడ్డును ఆక్రమించాయి. దీనితో పాదచారులు నడి రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి చోటు చేసుకుంటుంది. ఇది సురక్షిత ప్రయాణానికి పెద్ద ఆటంకంగా మారుతుందిని ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందో అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలి..

మున్సిపల్ అధికారులు ట్రాఫిక్ పోలీసులు ఎన్ సిసి గేటు వద్ద జరుగుతున్న రోడ్డు, ఫుట్పాత్ ఆక్రమణలపై వెంటనే స్పందించి సమస్యను తీర్చాలని ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం సరికాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంలో బాధ్యతాయుతంగా ఉన్న అధికారులు ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయడం ప్రజా జీవితం పై తీవ్ర ఆటంకం కలుగుతుందని అధికారుల నిర్లక్ష్యంతో ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని వెంటనే ట్రాఫిక్ పోలీసులు మున్సిపల్ అధికారులు ఎన్ సిసి గేటు వద్ద ఫుట్ పాత్, రోడ్డు కబ్జా చేసి నిర్వహిస్తున్న వ్యాపారాలను శాశ్వతంగా తొలగించి వాహనాదారులకు పాదాచారులకు మార్గం సుఖమం చేయాలని కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588